## కులగణన ఉద్దేశం కేంద్రానికి లేదు

న్యూఢిల్లీ : కులగణనపై కాంగ్రెస్, బీజేపీ నడుమ మళ్లీ విమర్శల యుద్ధం మొదలైంది. జనాభా లెక్కల సేకరణకు కేంద్ర హోం శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో కులగణన ప్రస్తావనే లేదని, అసలది జరిపే ఉద్దేశమే మోదీ ప్రభుత్వానికి లేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ ఆరోపించారు. రాజకీయ లబ్ధి పొందాలన్న లక్ష్యం నెరవేరకపోవడంతో ఆ పార్టీ దుష్ప్రచారాలకు దిగుతోందని బీజేపీ మండిపడింది. పైలట్ ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. కులగణనకు కేంద్రం కావాలనే జాప్యం చేస్తోందన్నారు. 'ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కులగణనకు డిమాండ్ చేస్తోంది. మోదీ ప్రభుత్వం రాహుల్ ఒత్తిడికి తలొగ్గి జనగణనతోపాటే కులగణన చేపడతామని ప్రకటించింది. కానీ క్షేత్ర స్థాయిలో వాస్తవాలు వేరుగా ఉన్నాయి. జనాభా లెక్కల సేకరణకు రూ.10 వేల కోట్లు అవసరం.

RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 197 మంగళవారం 12 ఆగష్టు 2025 పేజీలు : 4



# దెబ్బకు దెబ్బ!

## అమెరికాపై ప్రతీకార సుంకాలకు భారత్ రెడీ..

## ట్రంప్‌కు చుక్కలు చూపించే ప్రణాళిక!

అగ్ర రాజ్యం అమెరికా-భారత్ మధ్య సుంకాల వార్ నడుస్తోంది. నిన్నామొన్నటిదాకా మంచి స్నేహ సంబంధాలు ఉన్న దేశాలు.. ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భారత్‌పై తొలుత 25 శాతం సుంకాన్ని ట్రంప్ విధించారు. ఇది ఆగస్టు 7 నుంచి అమల్లోకి వచ్చింది. ఇంతలోనే మరో బాంబ్ పేల్చారు. రష్యాతో సంబంధం పెట్టుకున్నందుకు మరో 25 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇది ఆగస్టు 27 నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించారు. మొత్తంగా ఆసియా దేశాల్లో అత్యధికంగా భారత్‌పైనే సుంకం విధించారు. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలకు దారి తీసింది. ఈ పరిమాణంపై ప్రధాని మోడీ స్పందిస్తూ.. తమకు అన్నదాతలే ముఖ్యమని.. ఎంత టారిఫ్‌లైనా భరిస్తామంటూ తెలిపారు. రైతుల కోసం ఎక్కడా రాజీపడబోమని తేల్చి చెప్పారు. అయితే తాజాగా అమెరికాపై ప్రతీకార సుంకాలకు భారత్ సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. ఈనెలలోనే తొలి ప్రతీకార చర్య ఉండొచ్చని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఎంపిక చేసిన అమెరికా వస్తువులపై సుంకాలు విధించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే సుంకాలపై తేలే వరకు భారత్‌తో ఎలాంటి చర్చలు ఉండవని ట్రంప్ తేల్చి చెప్పారు. చర్చలకు వాషింగ్టన్ ముందుకు రాకపోవడంతో ప్రతీకారం తీర్చుకోవడమే ముందున్న మార్గమని.. మరొక మార్గం లేదని విషయాలు తెలిసిన వ్యక్తి ఓ జాతీయ మీడియాతో పేర్కొన్నారు.

**ఆసియా దేశాలపై టారిఫ్‌లు ఇలా..** భారత్- 50 శాతం, సిరియా-41 శాతం, మయన్మార్-40 శాతం, లావోస్- 40 శాతం, ఇరాక్ -35 శాతం, చైనా -30 శాతం, కజికిస్థాన్-25 శాతం, వియత్నాం- 20 శాతం, శ్రీలంక-20 శాతం, పాకిస్థాన్-19 శాతం టారిఫ విధించారు.

**మోడీ - పుతిన్ చర్చలు, స్నేహానికి వాగ్దానం :** ఇటీవల ప్రధానమంత్రి మోడీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఫోన్ ద్వారా ఒక ముఖ్యమైన చర్చ జరిపారు. ఈ చర్చల్లో, ఉక్రెయిన్ యుద్ధం, రష్యా ప్రస్తుత పరిస్థితి మరియు రెండు దేశాల మధ్య సంబంధాల గురించి లోతుగా చర్చించారు. ఈ చర్చల తర్వాత, ప్రధానమంత్రి మోడీ తన ఎక్స్ పేజీలో, "నేను నా మిత్రుడు పుతిన్‌తో ముఖ్యమైన చర్చలు జరిపాను. ఈ స్నేహాన్ని మరింత పెంచుకోవాలని మేము నిర్ణయించుకున్నాము. భారత్-రష్యా నిరంతరం సన్నిహిత మిత్రదేశాలుగా కొనసాగుతాయి" అని తెలిపారు. మోడీ ఈ మాటలు కేవలం దౌత్యపరమైన ప్రకటనలు మాత్రమే కాదు. భారత్‌పై అమెరికా విధించిన 50% పన్ను మరియు అంతర్జాతీయ ఒత్తిళ్ల మధ్య కూడా, భారత్ తన దీర్ఘకాల మిత్రదేశమైన రష్యాతో సంబంధాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించుకుందనే స్పష్టమైన సందేశాన్ని ఇది ప్రపంచానికి తెలియజేస్తుంది.

**అమెరికాకు వ్యతిరేకంగా పరోక్ష సందేశం...** మోడీ ఈ చర్య ట్రంప్ కోపానికి ప్రధాన కారణమైంది. రష్యా నుండి చమురు కొనకూడదనే అమెరికా షరతును భారత్ పట్టించుకోకుండా, పుతిన్‌తో స్నేహాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించుకోవడంలో ఒక పరోక్ష సందేశం ఉంది. అదేమిటంటే, "అమెరికాను వ్యతిరేకించడానికి మేమిద్దరం సిద్ధంగా ఉన్నాము" అని.

**ట్రంప్ షరతు:** డొనాల్డ్ ట్రంప్ భారతదేశంపై 50% పన్ను విధించడానికి, భారత్ రష్యా నుండి చమురు కొనడమే కారణమని పేర్కొన్నారు. కానీ, ఆయన భారత్ అమెరికా షరతుకు కట్టుబడి, రష్యాతో వ్యాపారాన్ని తగ్గిస్తుందని ఆశించారు.

**మోడీ సమాధానం:** కానీ, మోడీ ప్రభుత్వం దీనికి విరుద్ధంగా రష్యాతో స్నేహాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించుకుంది. "అమెరికాపై ఆధారపడకుండా, మా దేశ ప్రయోజనాలకు ఏది ముఖ్యమో అదే చేస్తాం" అనే భారతదేశ విధానాన్ని ఇది సూచిస్తుంది.

**ట్రంప్ కోపం మరియు దాని పరిణామాలు....** భారతదేశ ఈ వైఖరి ట్రంప్‌కు పెద్ద నిరాశ మరియు కోపాన్ని కలిగించింది. అమెరికాకు లొంగిపోవడానికి నిరాకరించే దేశాలకు గుణపాఠం చెప్పాలనే ట్రంప్ ఆలోచనకు మోడీ చర్య ఒక సవాలుగా నిలిచింది. దీని ఫలితంగా, ట్రంప్ భారత్‌పై వరుసగా పన్ను విధించడం వంటి చర్యలు తీసుకుంటున్నారు. కానీ, ఈ చర్యలు అమెరికా దేశీయ ఆర్థిక వ్యవస్థనే ప్రభావితం చేశాయి. అంతేకాకుండా, ప్రపంచ దేశాలు డాలర్‌కు ప్రత్యామ్నాయంగా ఒక సాధారణ కరెన్సీని వెతుకుతున్న తరుణంలో, రష్యాతో భారతదేశ బలమైన సంబంధం డాలర్ ప్రపంచ ఆధిపత్యాన్ని తగ్గించడానికి దారితీస్తుందని కూడా భావిస్తున్నారు. మొత్తంగా, మోడీ-పుతిన్ చర్చలు కేవలం దౌత్యపరమైన చర్చలు మాత్రమే కాదు, మారుతున్న ప్రపంచ క్రమంలో భారతదేశ ప్రత్యేకత మరియు దృఢమైన వైఖరిని ప్రపంచానికి తెలియజేసే ఒక ముఖ్యమైన సంఘటన.



## రేవంత్‌రెడ్డిపై నమోదైన కేసును కొట్టేసిన హైకోర్టు

హైదరాబాద్: రేవంత్‌రెడ్డిపైనమోదైన కేసును తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. 2019 అక్టోబర్‌లో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పీఎస్‌లో ఆయనపై కేసు నమోదైంది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని నమోదైన ఈ కేసును కొట్టేయాలని రేవంత్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ కేసును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రేవంత్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు దాఖలు చేసిన పిటిషనర్ పెద్దిరాజుకు సుప్రీంకోర్టు అక్షింతలు వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యకు అఫిడవిట్ రూపంలో క్షమాపణలు చెప్పాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఆదేశించింది. రేవంత్‌రెడ్డిపై పెద్దిరాజు దాఖలు చేసిన కేసును గతంలో తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. ఆ కేసును నాగ్‌పూర్ బెంచ్‌కు బదిలీ చేయాలని సుప్రీంకోర్టులో పెద్దిరాజు ట్రాన్స్‌ఫర్ పిటిషన్ దాఖలు చేశారు. అందులో హైకోర్టు న్యాయమూర్తిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. పిటిషన్ డ్రాఫ్ట్ చేసిన ఏఓఆర్, పెద్దిరాజుపై సీజేఐ ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యకు క్షమాపణలు చెప్పాలని తెలిపింది. క్షమాపణ చెపుతూ దాఖలు చేసే అఫిడవిట్‌పై నిర్ణయాన్ని జస్టిస్ మౌసమి భట్టాచార్యకు వదిలేసింది. వారం రోజుల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని పెద్దిరాజుకు ఆదేశాలు ఇచ్చింది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది.

## తెలంగాణలోని ఈ 11 జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్ వాతావరణ కేంద్రం తాజాగా కీలక హెచ్చరిక జారీ చేసింది. వచ్చే రెండు మూడు రోజుల పాటు తెలంగాణలో భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. తూర్పు-ఈశాన్య దిశగా ఏర్పడిన ఋతుపవన ద్రోణి ప్రభావం ఇప్పటికీ కొనసాగుతోంది. ఇది అరుణాచల్ ప్రదేశ్ వరకు వ్యాపించిందని అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రభావంతో వర్షాలు తెలంగాణలో కొనసాగే అవకాశం ఉంది. అంతేకాదు, ఉత్తర అంతర్గత కర్ణాటకపై ఉపరితల ఆవర్తనం 5.8 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆగస్టు 13న వాయువ్య మరియు పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీనివల్ల వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది.

**తెలంగాణలోని 11 జిల్లాల్లో వర్ష భయం ఎక్కువగా ఉంది. ఇవే:** ఆదిలాబాద్. కొమరం భీమ్ ఆసిఫాబాద్. సిద్దిపేట. యాదాద్రి భువనగిరి. రంగారెడ్డి. హైదరాబాద్. మేడ్చల్ మల్కాజ్గిరి. వికారాబాద్. సంగారెడ్డి. మెదక్. కామారెడ్డి.

**ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులకు అవకాశం :** వర్షాలు సాధారణంగా ఉండేలా కనిపించకపోవచ్చు. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీసే అవకాశం ఉంది. వానతో పాటు ఉరుములు, మెరుపులు ఉండబోతున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఇదిలా ఉంటే, వర్షపాతం పెరగబోతున్న నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచనలు వెలువడ్డాయి. ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలని, పాత మరియు నీటి మునిగే ప్రాంతాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.




**నగరంలోనూ వర్ష బీభత్సానికి అవకాశం:** హైదరాబాద్ సహా చుట్టుపక్కల జిల్లాల్లో కూడా వర్ష ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా ట్రాఫిక్ దెబ్బతినే ప్రమాదం ఉంది. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరే అవకాశం ఉంది. ఈ వర్షాల సమయంలో ప్రజలు కొంత జాగ్రత్తగా ఉండాలి. అవసరం లేకుండా బయటకు వెళ్లకూడదని అధికారులు హెచ్చరిస్తున్నారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను తడిపేయకుండా చూసుకోవాలి. విద్యుత్ పోకడల విషయంలో జాగ్రత్త వహించాలి.

**వర్షాల కారణంగా ఏం జరగొచ్చు?...** పంటలకు నష్టం కలిగే అవకాశం ఉంది. నగరాల్లో నీటి మిగులు ఉండొచ్చు. రహదారులపై ట్రాఫిక్ కష్టాలు. విద్యుత్ లైన్లకు ఆటంకం. పల్లె ప్రాంతాల్లో ఆహార, రవాణా సమస్యలు. తెలంగాణలో వర్షాలు కురవడం సాధారణం అయినా, ఈసారి ప్రభావం కొంత తీవ్రంగా ఉండే సూచనలు ఉన్నాయి. ప్రభుత్వం, అధికారులు ఇప్పటికే అప్రమత్తమయ్యారు. జనాలు కూడా జాగ్రత్తగా ఉండాలి. ఈ వర్ష కాలంలో ముందస్తు జాగ్రత్తలే మన రక్షణ.




# 'జూబ్లీహిల్స్‌కు సినీ గ్లామర్'

## తెరపైకి చిరంజీవి - నాగార్జున పేర్లు!

## హోం మినిస్టర్ ఆఫర్ చేస్తున్నారా!?

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయం సాధించేందుకు కాంగ్రెస్ పక్కా వ్యూహాలను రచిస్తున్నది. అక్కడ గెలిచిన వ్యక్తికి హోంమంత్రి పదవి ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ తీసుకున్నట్లు సమాచారం. అభ్యర్థిని ప్రకటించే సమయంలోనే, జూబ్లీహిల్స్‌కు హోం మంత్రి పదవి ఇస్తామని పబ్లిక్‌గా ప్రకటించాలనే ప్లాన్‌లో ఉన్నట్లు తెలిసింది. దీనితో అక్కడ బరిలోకి దిగే లీడర్‌తో పాటు, స్థానిక క్యాడర్ గెలుపు కోసం సీరియస్‌గా పనిచేస్తారు. అదేసమయంలో విపక్ష అభ్యర్థుల కంటే కాంగ్రెస్ అభ్యర్థికి ఒక గ్లామర్ వస్తుందని అంచనాలో హస్తం లీడర్లు ఉన్నారు.

**స్ట్రాంగ్ అభ్యర్థి కోసం అన్వేషణ...** జూబ్లీహిల్స్‌లో బలమైన అభ్యర్థిని బరిలోకి దించాలని రేవంత్ భావిస్తున్నారు. అందుకోసం ఆయన పలువురు సినిమా లీడర్ల పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తున్నది.

ఇప్పటికే మాజీ కేంద్ర మంత్రి, సినిమా నటుడు చిరంజీవితో అభ్యర్థి ఎంపికపై చర్చించారు. అయితే ఆయన ముందుగా ఇంట్రస్ట్ చూపలేదని, హోం మంత్రి పదవి ఆఫర్ చేయడంతో ఆలోచనలో పడినట్లు ప్రచారం జరుగుతున్నది.

ఒకవేళ ఆయన పోటీ చేయలేనని చేతులు ఎత్తిస్తే, కమ్మ సామాజిక వర్గానికి చెందిన సినిమా నటుడు నాగర్జున పేరును సైతం పరిశీలిస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ మేరకు ఆయనతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. ఒకవేళ ఆయన సైతం నో చెపితే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నివాసం ఉంటోన్న పలువురు పారిశ్రామిక వేత్తల పేర్లను సైతం పరిశీలిస్తున్నట్లు సమాచారం.

**'హోం'ఆఫర్‌తో పాజిటివ్ ఒపీనియన్...** ఇప్పటివరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధి నుంచి కేబినెట్‌లో ప్రాతనిధ్యం లేదు. ఎందుకంటే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేలు గెలవలేదు. ఉప ఎన్నికల్లో కంటోన్మెంట్ నుంచి శ్రీగణేష్ విజయం సాధించారు. కానీ ఎస్సీ సామాజిక వర్గం నుంచి ముగ్గురు మంత్రులు ఉండటంతో ఆయనకు ఛాన్స్ రాదు. గ్రేటర్ హైదరాబాద్‌కు మంత్రివర్గ ప్రక్షాళనలో మంత్రి పదవి ఇవ్వక తప్పదు. అందుకని జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి హోం మంత్రి ఇస్తామని ముందుగానే ప్రకటిస్తే, ఎన్నికల్లో పాజిటివ్ ఒపీనియన్ ఏర్పడుతుంది. అదే సమయంలో స్థానిక ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ఓటు వేస్తారని అంచనాలో హస్తం లీడర్లు ఉన్నారు. అయితే హోం మంత్రి పదవి ప్రస్తుతం సీఎం రేవంత్ వద్దే ఉంది. భవిష్యత్‌లో జరిగే మంత్రివర్గ ప్రక్షాళనలో ఎవరికో ఒకరికి ఇవ్వక తప్పదు. అందుకని జూబ్లీహిల్స్ ఎన్నికల అభ్యర్థికి ఇస్తామని ప్రకటిస్తే అన్ని ఇంటా, బయటా రాజకీయ సమస్యలకు చెక్ పెట్టొచ్చని వ్యూహంలో రేవంత్ ఉన్నట్లు తెలుస్తున్నది.

# సంపాదకీయం

## బీహార్ బరిలో కేజ్రీవాల్ బీజేపీ నెత్తిన పాలు పోస్తారా ?

బీహార్ లో మరి కొద్ది నెలలలో అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో మళ్ళీ గెలవాలని అక్కడ బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి భావిస్తోంది. ఈసారి గెలుపు బీజేపీకి చాలా ముఖ్యం. బీహార్ లో అధిక సంఖ్యలో ఎంపీ సీట్లు ఉన్నాయి. అలాగే ఉత్తరాదిన బీహార్ చాలా కీలకమైన రాష్ట్రం. అక్కడ కనుక ప్రతిపక్షం పాగా వేస్తే 2029 లోక్ సభ ఎన్నికల నాటికి వారి రాజకీయ విస్తరణకు బాటలు పడతాయని బీజేపీ ఆలోచిస్తోంది. అందుకే ఎట్టి పరిస్థితుల్లో అవకాశమే ఇవ్వకూడదని పట్టుదలతో పనిచేస్తోంది. బీజేపీ జేడీయూ ఘట బంధన్ బీహార్ లో బలంగా ఉందని నమ్ముతోంది. మరో వైపు చూస్తే జన సూరజ్ పార్టీతో ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ అలియాస్ పీకే బరిలో ఉంటున్నారు. ఆయన పార్టీ పోటీ వల్ల ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోతుందని కూడా లెక్క వేసుకుంటోంది. అయితే ప్రతీ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో మజ్లిస్ పోటీ చేస్తోంది. ఆ విధంగా ఆ పార్టీ ఇండియా కూటమి ఓట్లను లాగేసుకుంటోంది. దాంతో కూటమికి అది ఇబ్బందిగా మారి ఎన్డీయే భారీగా రాజకీయ లాభం పొందుతోంది. బీహార్ లో చూస్తే ఎక్కువ ముస్లిం డామినేషన్ అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. మరి ఈసారి కూడా మజ్లిస్ సొంతంగా పోటీకి దిగుతుందా అంటే అలా కాదు అని ఆ పార్టీ అధినేత ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెబుతున్నారు. బీజేపీని ఓడించడమే తమ అంతిమ లక్ష్యమని ఆయన చెబుతున్నారు. అందువల్ల తాము కూటమితో పొత్తులకు వెళ్తామని అంటున్నారు. తమకు బలం ఉన్న సీట్లను ఇండియా కూటమి ఇస్తే కనుక కలసి పోటీ చేసి బీహార్ లో ఎన్ డీయే ప్రభుత్వం రానీయకుండా చేస్తామని శపథమే చేస్తున్నారు. మహారాష్ట్రతో పాటు చాలా చోట్ల మజ్లిస్ ఒంటరి పోరు బీజేపీకి కలసి వచ్చింది. ఈసారి మాత్రం అసదుద్దీన్ కొత్త వ్యూహం అనుసరిస్తామని చెప్పడంతో బీహార్ లో బీజేపీకి ఇబ్బందే అని అంతా అనుకుంటున్నారు. అయితే అదే సమయంలో ఆప్ బీజేపీకి అనుకోని వరాన్ని ఇస్తున్నట్లుగా పరిస్థితి కనిపిస్తోంది. బీహార్ ఎన్నికల్లో తాము ఒంటరిగా పోటీ చేస్తామని ఆప్ అధినేత కేజ్రీవాల్ తాజాగా ప్రకటించారు. బీహార్ లో కాంగ్రెస్ తో కానీ ఇండియా కూటమితో కానీ తమకు ఎటువంటి పొత్తులు ఉండవని ఆయన తెగేసి చెబుతున్నారు. దాంతో బీజేపీ నెత్తిన పాలు పోయడానికేనా ఆప్ అధినేత ఈ విధంగా నిర్ణయం తీసుకున్నారు అన్నది చర్చకు వస్తోంది. నిజానికి ఆప్ చాలా కాలం నుంచే ఒంటరిగా పోటీ చేస్తోంది. ఆ పార్టీ ఢిల్లీ ఎన్నికల్లో కూడా పొత్తులు లేకుండా పోటీకి దిగి కోరి ఓటమిని తెచ్చుకుంది. అయినా సరే తమది అదే రూట్ అంటోంది. గుజరాత్ లో కూడా తాము ఒంటరిగా పోటీ చేస్తామని చెబుతోంది. ఆప్ కి కోపం ఏమిటి అంటే ఢిల్లీలో ఒంటరిగా పోటీ చేసి కాంగ్రెస్ తమ విజయావకాశాలను దెబ్బ తీసింది అని. అందుకే కాంగ్రెస్ శిబిరంలో తాము చేరేది లేదని చెబుతోంది. ఈ విధంగా ఆప్ తీసుకున్న నిర్ణయంతో బీహార్ లో రాజకీయ పరిణామాలు మారుతాయా అన్నదే అంతా ఆలోచిస్తున్నారు. ఒక వైపు పీకే మరో వైపు ఆప్ ఇలా రెండు పార్టీలు వీలైనంత దాకా ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీలిస్తే కనుక మరోసారి బీహార్ లో అధికారం తమకు దక్కుతుందని బీజేపీ లెక్క వేస్తోంది. మరో వైపు మజ్లిస్ తో ఇండియా కూటమి పొత్తు కూడా అంత సులువు కాదని భావిస్తోంది. ఆ పార్టీ అడిగే సీట్లను కనుక కేటాయించకపోతే ఒంటరి పోరుకే మజ్లిస్ కూడా దిగుతుందని భావిస్తోంది. ఇలా విపక్షంలో చీలికలు బలహీనతలే బీహార్ కుర్చీని పదిలంగా తమకు అప్పగిస్తాయని బీజేపీ భావిస్తోందిట. బీజేపీయేతర రాజకీయ పార్టీలలో ఐక్యత ఇపుడు అంతటా కనిపించడం లేదు. కాంగ్రెస్ అందరినీ కలుపుకుని పోయే విషయంలో భేషజాలకు పోతోంది. అది కూడా బీజేపీకి అంది వచ్చిన అవకాశంగా మారుతోంది అని అంటున్నారు. ఈసారి కూడా బీహార్ లో ఓటమి చెందితే లాలూ పార్టీతో పాటు కాంగ్రెస్ కూడా రాజకీయంగా మరిన్ని ఇబ్బందులు చూడాల్సి వస్తుందని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## సకాలంలో ఇంటి పన్నులు చెల్లిస్తే మెరుగైన పౌర సేవలు పొందేందుకు దోహదపడుతుంది... తూముకుంట కమిషనర్



శామీర్ పేట, ఆగస్టు 11 ( గరుడ వార్త ) : తూముకుంట పట్టణ ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలని కమిషనర్ ఎం ఎన్ ఆర్ జ్యోతి కోరారు. సోమవారం శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. 1.ఇంటిపన్నులు, 2. ట్రేడ్ లైసెన్లు, 3. టౌన్ ప్లానింగ్ అంశాలు, 4. శ్మశాన వాటికలో మౌళిక సదుపాయాలు, 5. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక వసతుల కల్పన, 6. ప్రైవేట్ విద్యా సంస్థలలో మౌళిక సదుపాయాలు, 7. రెసిడెన్షియల్ హాస్టల్, పాఠశాలలో మౌళిక సదుపాయాలు లాంటి అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించి వార్డు ఆఫీసర్లకు తగు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రజలు సకాలములో ఇంటి పన్నులు,ట్రేడ్ లైసెన్సుల, ఇతర పన్నులు సకాలములో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసినా, చెరువులలో చెత్త వేసినా జరిమాన విధించడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలించి త్వరిత గతిన పూర్తి చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

## మొక్క.. నాటేందుకు ఓ లెక్క



కరీంనగర్ : వర్షాకాలం రానే వచ్చింది.. మొక్కలు నాటేందుకు సమయం వచ్చింది. తీరొక్క మొక్క నాటి రక్షించేందుకు ప్రతి ఒక్కరూ కదిలి రావాలి. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 7 నుంచి వన మహోత్సవం ప్రారంభించారు. కరీంనగర్ నగరంతోపాటు మిగతా పురపాలికల్లో ఇంటికి ఆరు మొక్కలు అందించేలా ప్రణాళికలు చేశారు. ఇందులో మూడు పండ్లు, మూడు పూల మొక్కలు పంపిణీ చేయనున్నారు. ఎక్కడెక్కడ ఎలాంటి మొక్కలు నాటాలి. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

**ఎక్కడ, ఎలాంటివి నాటాలంటే..**

ఇంటి ఆవరణ: మునగ, ఉసిరి, పనస, మామిడి, చింత, వేప, నిమ్మ, జామ, బొప్పాయి, దానిమ్మ, సపోట, కరివేపాకు, మందారం, సీతాఫలం.

కాలనీలు: టెకోమా, సీమ, తంగెడు, గుల్ మొహర్, వేప

చెరువుల వద్ద: నల్ల తుమ్మ, ఈత, తెల్లమద్ది, నేరేడు, వెదురు.

గుట్టలు: నెమలినార, కానుగ, సీమారుబా, వెలగ, నీరుద్ది.

రహదారికి ఇరువైపులా: గుల్ మొహర్, సీమ తంగెడు, రావి, కానుగ, వేప, నేరేడు, ఆకాశ మల్లె, పెల్టోఫాం, టేకు.

చేను గట్లు: టేకు, వెదురు, నీలగిరి, గ్లైరిసిడియా, సుబాబుల్, జామాయిల్, ఎర్ర చందనం.

పరిశ్రమల ఆవరణ: నెమలినార, మామిడి, కానుగ, వేప, సీమచింత, రావి, మర్రి, నేరేడు, సిస్సు, గుల్‌మొహర్, టేకు.

కార్యాలయాలు: వేప, నేరేడు, తంగేడు, టేకు, మామిడి.

**ఇలా చేస్తే మేలు..**

సంచి పరిమాణాన్ని దృష్టిలో ఉంచుకొని గుంత తవ్వాలి.

సారవంతమైన మట్టి, పశువుల ఎరువు లేదా డీఏపీ 2:1 నిష్పత్తిలో కలిపి సగం గుంత నింపి నీళ్లు పోయాలి.

మరుసటి రోజు వేపపిండితో గుంతను శుద్ధి చేస్తే మొక్క పురుగు పట్టకుండా ఉంటుంది.

సంచి నుంచి మొక్కను వేరు చేసి సగం మట్టి నింపిన గుంతలో పెట్టి పూడ్చాలి.

మొక్క వేళ్లకు బయటి గాలి తగలకుండా గుంత చుట్టూ గట్టిగా తొక్కాలి.

రహదారుల పక్కన నాటే వాటికి మధ్య దూరం 5, కాలనీల్లో నాటే వాటికి 3, పొదవుగా పెరిగే వాటికి 2 మీటర్ల వ్యత్యాసం ఉండాలి.

మూగజీవాల నుంచి రక్షణకు కంచె ఏర్పాటు చేయాలి.

చెట్ల కింద, విద్యుత్తు తీగల కింద నాటొద్దు.

చవుడు భూమిలో టేకు, వెదురు నాటితే చనిపోయే ప్రమాదముంది.

## మధ్యతరగతికి సన్నబియ్యం దన్ను



పెద్దపల్లి : రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీతో బహిరంగ మార్కెట్లో ధరలు తగ్గి కొనుగోలుదారులకు ఊరట కలుగుతోంది. జూన్ నుంచి క్రమంగా తగ్గుతున్న బియ్యం ధరలు జులై మొదటి వారం నాటికి భారీగా తగ్గాయి. నెల రోజుల వ్యవధిలో క్వింటాలు బియ్యం ధర రూ.200 నుంచి రూ.500 వరకు పడిపోయింది. ప్రధానంగా 'సాంబా' రకం బియ్యం ధర క్వింటాలుకు రూ.500 వరకు తగ్గింది. తగ్గిన బియ్యం ధరలతో మధ్య తరగతి ప్రజలకు మేలు కలగనుంది.

**పదిశాతం పడిపోయిన కొనుగోళ్లు**

ఉమ్మడి జిల్లాలో సుమారు 10 లక్షల రేషన్ కార్డులుండగా గత నెలలో మూడు నెలలకు సరిపడా 5,472 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేశారు. దీంతో ఒక్కో కుటుంబానికి కనీసం రెండు నెలలకు సరిపడా బియ్యం ఇంటికి చేరుకున్నాయి. రేషన్ కార్డులు లేని మరో రెండు లక్షల కుటుంబాలున్నాయి. ప్రస్తుతం వీరు మాత్రమే బహిరంగ మార్కెట్‌లో బియ్యం కొనుగోలు చేస్తుండగా వీరికి ఒక నెలలో సమారు 600 మెట్రిక్ టన్నులు (సుమారు 60 లారీలు) బియ్యం మాత్రమే సరిపోతాయి. కానీ సరఫరా మాత్రం 2 నుంచి 3వేల మెట్రిక్ టన్నుల వరకు ఉంటుంది. అవసరాన్ని బట్టి మరింత పెరిగే అవకాశముంది. డిమాండ్ సప్లయి సూత్రం తిరగబడటంతో బియ్యం ధరలు తగ్గాయి. దీనికి తోడు సన్న బియ్యానికి పొరుగు రాష్ట్రాల్లో గిరాకీ లేకపోవడం కూడా ధరలు పడిపోవడానికి మరో కారణం.

బియ్యం ధరలు పడిపోవడంతో వ్యాపారులు బియ్యం నాణ్యతపై దృష్టిపెట్టారు. ప్రజా పంపిణీ ద్వారా ప్రభుత్వం ఇచ్చే బియ్యంలో 20 నుంచి 30 శాతం వరకు నూక, ఇతర వ్యర్థాలు ఉండటంతో బహిరంగ మార్కెట్‌లోని వ్యాపారులు నూరుశాతం నూక లేని బియ్యంతోపాటు పొట్టు, దుమ్ము లేని బియ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ రకంగానూ కొనుగోలుదారులకు మేలు కలుగుతోంది.

## పారిశుద్ధ్యం.. పర్యవేక్షణ భారం

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ భారంగా మారుతోంది. గతంలో ఉన్న 50 డివిజన్లను 60 డివిజన్లకు పెంచారు. ఆ తర్వాత 66 డివిజన్లుగా మార్చడంతో పారిశుద్ధ్య కార్మికులు సంఖ్య కూడా పెరిగింది. డివిజన్ల వారీగా ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు ఉన్నారు. అయితే వీరందరితో పనులు చేయించడానికి పారిశుద్ధ్య పర్యవేక్షకులు తప్పనిసరిగా ఉండాలి. జవాన్లకు పెత్తనం ఇవ్వడం, ఇన్‌స్పెక్టర్ల విధులను నామమాత్రం చేయడంతో క్షేత్రస్థాయిలో పనుల పర్యవేక్షణ భారమవుతోంది. కార్మికులకు బాధ్యతలు అప్పగించడంతో పట్టింపు లేకుండా పోతోంది. శుభ్రం చేయడంతోపాటు పర్యవేక్షణ చేయలేకపోతున్నారు. ప్రధాన రహదారులు, వీధులు తప్ప శివారు కాలనీల్లో శుభ్రం చేసేందుకు కార్మికులు కనిపించడంలేదనే ఫిర్యాదులు వస్తున్నాయి.

**ఇన్‌ఛార్జులతోనే..**

నగర పరిధిలో అయిదు చొప్పున శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండేళ్లుగా పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఇన్‌ఛార్జులతోనే నెట్టుకొస్తున్నారు. ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న పర్యావరణ ఇంజినీర్లు, పశు వైద్యాధికారికి బాధ్యతలు అప్పగించారు. పెరిగిన డివిజన్లలో కార్మికులు ఎంతమేర పని చేస్తున్నారో గుర్తించడం కష్టంగా మారుతోంది. జవాన్లకు కూడా ఈ విషయంలో స్పష్టత లేదు. పర్యవేక్షణ లేకపోవడంతో పలువురు కార్మికులు నామమాత్రంగా పనిగంటలు ముగిస్తే చాలన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

**ఆరోగ్య అధికారి ఎక్కడ?**

పారిశుద్ధ్య విభాగానికి ఆరోగ్య అధికారి (ఎంహెచ్‌వో) కీలకం. 20 ఏళ్లుగా ఆ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో మాంసం దుకాణాలు, హోటళ్లు, ఇతరత్రా శుభ్రత చర్యలు పరిశీలించే అధికారి కొరత కనిపిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పరిశీలించి ఖాళీగా ఉన్న శానిటరీ సూపర్‌వైజర్ పోస్టులతోపాటు ఎంహెచ్‌వోను తీసుకురావాలని నగరవాసులు కోరుతున్నారు.

## శివాలయంలో శ్రీ రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు






శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసంలో శివ కేశవులను ఎంతో నిష్టతో ఆరాధిస్తారు. ఇందులో భాగంగా శ్రావణ సోమవారం పురస్కరించుకొని శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఎంతో భక్తిశ్రద్ధలతో స్వామివారికి పంచామృతాభిషేకం చేశారు.అనంతరం హారతి, మంత్రపుష్పం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## ఘనంగా శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు....

శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు ఘనంగా భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపల్ పరిధిలోని శ్రీ గాయత్రి మహా క్షేత్రంలో ఆలయ వ్యవస్థాపకులు, వాక్ బ్రహ్మ, శిష్యజనోద్ధారక డాక్టర్ ఎస్ వి ఎల్ ఎన్ మూర్తి ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుల మంత్రోశ్చరణల మధ్య అంగరంగ వైభోగంగా శ్రీ రాఘవేంద్ర స్వామి 354 వ ఆరాధన మహోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం శ్రీ రాఘవేంద్ర స్వామి మధ్యారాధనలో భాగంగా ఉదయం నిర్మాల్య విసర్జన, ఫలపంచామృత అభిషేకము, పాదపూజ,







కనకాభిషేకము, తులసి అర్చన, అలంకార బ్రాహ్మణ పాదప్రక్షాళన, హస్తోదకం, తీర్థప్రసాద వితరణ అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం పల్లికి సేవా, రథోత్సవం, అష్టావధాన సేవ, మహా మంగళహరతి తీర్థ ప్రసాద వితరణ జరిపారు. ఈ పూజ కార్యక్రమంలో ఉమ్మడి మండలంలోని భక్తులతో పాటు నగరానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మూడు చింతలపల్లి మాజీ సర్పంచ్ మృతి



శామీర్ పేట, (గరుడ వార్త) : అనారోగ్యంతో మూడు చింతలపల్లి మాజీ సర్పంచ్ మృతి చెందిన సంఘటన మండల కేంద్రం మూడు చింతలపల్లిలో చోటుచేసుకుంది. మూడు చింతలపల్లి కి చెందిన కామిడి మధుసూదన్ రెడ్డి అనారోగ్య కారణాలతో సోమవారం మృతి చెందాడు. ఆయన మూడు చింతలపల్లి గ్రామానికి గతంలో సర్పంచ్ గా సేవలందించారు. అలాగే ప్రస్తుతం శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి జూనియర్ కాలేజ్ కి చైర్మన్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన సేవలను పలువురు కొనియాడుతూ నివాళులర్పించారు.

## ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ నేతన్నల ర్యాలీ

మంగళగిరి: చేనేత రంగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తూ, వారి ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ కార్మికులు సోమవారం పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. నెలకు 200 విద్యుత్ యూనిట్లు, ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చడంతో గుంటూరు జిల్లా మంగళగిరిలో సోమవారం చేనేత కార్మికులు, కూటమి నేతలు భారీ కృతజ్ఞత యాత్ర చేపట్టారు. మంగళగిరి సీతారామ కోవెల నుంచి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వరకు చేపట్టిన ర్యాలీలో పెద్దఎత్తున చేనేత కార్మికులు పాల్గొన్నారు. ట్రాక్టర్ పై మగ్గం, రాట్నం పెట్టి ఒడుకుతూ ర్యాలీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. మహిళలు తాము నేసిన చీరలు పట్టుకొని ప్రదర్శన నిర్వహించారు.

# మార్కెట్ యార్డు అభివృద్ధికి మోక్షమెప్పుడు

రాయికల్ : రైతులకు సేవలందించి పంటలు కొనుగోలు చేయడానికి ఏర్పాటు చేసిన రాయికల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో చేపట్టిన అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. పనులపై పర్యవేక్షణ లేక బిల్లులు రాక పనులు ముందుకు సాగడంలేదు. గతంలో ధర్మపురి వ్యవసాయ మార్కెట్‌కు ఉప కేంద్రంగా ఉన్న రాయికల్‌ను ప్రత్యేక మార్కెట్ యార్డుగా 2016లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2017లో తొలి పాలకవర్గాన్ని ఏర్పాటుచేసింది. అయితే రెండేళ్ల క్రితం కమిటీలను రద్దు చేయగా నూతన కమిటీలను ప్రభుత్వం ఇంకా ఏర్పాటు చేయలేదు.



**బిల్లులు రాక నిలిచిన పనులు**

రాయికల్‌లో మార్కెట్ కమిటీ సుమారు ఆరు ఎకరాల్లో కొనసాగుతుండగా.. కార్యాలయం, గిడ్డంగులను నిర్మించారు. రెండేళ్ల క్రితం మార్కెట్ యార్డులో రూ. 1.80 కోట్లతో ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణం, రూ. 20 లక్షలతో మట్టి పనుల నిర్వహణకు టెండరు పూర్తి చేసి పనులను ప్రారంభించారు. రూ. 20 లక్షలతో మట్టి పనులు పూర్తయినప్పటికి ప్రహరీ నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం ఇంకా పూర్తి చేయలేదు. బిల్లులు రాక గుత్తేదారులు పనులు నిలిచాయి. యార్డులో పనులు పూర్తి కాకపోవడంతో వసతులు కరవయ్యాయి.

**ఏటా ఆరు బయటే కొనుగోళ్లు**

యార్డులో వసతులు లేక ఏటా వరి, మక్కలు తదితర పంటలను మార్కెట్ పక్కనే ఉన్న స్థలాల్లో ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తున్నారు. దీంతో వర్షాలు కురిస్తే పంటలు తడిసి కొట్టుకుపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డుకు ఆదాయమున్నా వసతులు లేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ రెండు పంటలు మినహా ఇతర పంటలు కొనుగోలు చేయకపోవడంతో పప్పులు, ఇతర వాణిజ్య పంటలను దళారులకు విక్రయించి నష్టపోతున్నారు. మార్కెట్ కమిటీకి పాలకవర్గం ఏర్పాటుచేసి నిధులు మంజూరు చేసి వసతులు కల్పించాల్సి ఉంది.

# శుభ్రత.. అప్రమత్తత అవసరం

కరీంనగర్ : కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన గురుకులాల్లో పౌష్టికాహారం అందిస్తున్నా.. విద్యార్థులు తరచూ అస్వస్థతకు గురవుతున్నారు. ఇటీవల రాష్ట్రంలోని పలు విద్యాలయాల్లో ఈ పరిస్థితి ఏర్పడగా జగిత్యాల జిల్లాలోనూ గత నెల జ్యోతిభాపులే గురుకులంలో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. అధికారులు పలు చర్యలు తీసుకుంటున్నా ఇలాంటి ఘటనలు తరచూ పునరావృతమవుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే గురుకులాల్లో స్టీల్ పాత్రల్లో వంట చేసే కార్యక్రమానికి ఇటీవలే సంక్షేమ శాఖల మంత్రి లక్ష్మణ్‌కుమార్ శ్రీకారం చుట్టారు. స్టీల్ పాత్రల్లో వండటంతోపాటు జాగ్రత్తలు తీసుకుంటేనే ఇబ్బందులు తప్పుతాయి.

**89 గురుకులాలు..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 89 గురుకులాలు ఉండగా సుమారు 45 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆహార పదార్థాల నిల్వలో, వండే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో భోజనం వికటించడానికి కారణమవుతోందని అధికారుల తనిఖీల్లో వెల్లడవుతోంది. గుత్తేదారులు గంపగుత్తగా కూరగాయలు తెచ్చి, గాలి వెలుతురు సరిగా లేని ప్రాంతాల్లో నిల్వ చేయడం, క్రిమిసంహారక మందులతో పెంచుతున్న కూరగాయలు, ఆకుకూరలను సరైన రీతిలో శుభ్రం చేయకపోవడం, వండటంలో నిర్లక్ష్యం సమస్యకు కారణమవుతోంది.

**వైద్యుల సూచనలు ఇవీ..**

కూరగాయలు, ఆకుకూరలు రెండు రోజులకన్నా ఎక్కువ నిల్వ చేయొద్దు. గాలి, వెలుతురు ఉండే ఆవరణలో విడివిడిగా నిల్వ చేయాలి. వర్షాకాలంలో ఆకుకూరలు, క్యాబేజీ, కాలీఫ్లవర్, పప్పులు, మాంసాహారం ఒకే రోజు వండొద్దు. వంట గదులు, సరకులు నిల్వ చేసే



ప్రదేశాలు, వంట పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. శుద్ధ నీటినే తాగాలి. వంట అవసరాల కోసం వినియోగించాలి.

ఏరోజు పాలను ఆరోజే వాడాలి. వంద శాతం మరిగిన పాలనే విద్యార్థులకు అందించాలి కోడిగుడ్లు, మాంసాహారాన్ని శుభ్రంగా కడగడంతోపాటు పూర్తి స్థాయిలో ఉడికించాలి.

రోజంతా పప్పు ధాన్యాలు తింటే జీర్ణక్రియ సమస్యలు ఏర్పడతాయి. పప్పు ఉన్న రోజు అల్పాహారంగా పండ్లు, రాగిజావ, కూరగాయలు వంటి వాటిని అందించాలి

కూరగాయలను వండే ముందు ఉప్పు లేదా వెనిగర్‌తో శుభ్రం చేస్తే బ్యాక్టీరియా నశిస్తుంది. వండే ముందు మాత్రమే కూరగాయలను కోస్తే బ్యాక్టీరియా వృద్ధి చెందదు.

ప్యాకెట్లలోని పదార్థాలను వాడేటప్పుడు కాలం అయిపోయినవి, పాడైపోయిన వాటిని ఉపయోగించకూడదు

వంట చేసేవారు చేతులకు తొడుగులు, తలకు టోపీలు, యాప్రాన్‌లు ధరించాలి. అనారోగ్యంతో ఉంటే వంట జోలికి వెళ్లొద్దు


విద్యార్థులు ఆహారం తినకముందు, తిన్న తరువాత... వంట చేసేవారు తరచూ చేతులను శుభ్రం చేసుకుంటూ ఉండాలి.

ఏ పూట వండిన ఆహారం ఆ పూటకే వినియోగించాలి

పాత్రలు ఉపయోగించే ముందు, ఉపయోగించిన తరువాత శుభ్రంగా కడగాలి **సరైన రీతిలో వండాలి – స్ఫూర్తి బుర్ర, డైటీషియన్, కరీంనగర్**

పరిశుభ్రతను అన్ని చోట్లా పాటించడంతోపాటు వాతావరణ పరిస్థితులను బట్టి ఆకుకూరలు, మాంసాహారం, పప్పుల వాడకంలో మార్పులు చేయాలి. పాలు, పెరుగు, మాంసాహారాన్ని సరైన రీతిలో వేడి చేయకపోవడం, ఉడికించని కారణంగా వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వంటి సమస్యలు వస్తాయి. అల్యూమినియం పాత్రల కంటే స్టీలు పాత్రల్లో వండటం శ్రేయస్కరం.

# ఒక్కొక్కటిగా.. చిక్కుముళ్లు వీడేలా..



కొత్తగూడెం : భూ సమస్యల పరిష్కారానికి అధికారులు కసరత్తు ముమ్మరం చేస్తున్నారు. ఆగస్టు 15 నాటికి భూభారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని భూసమస్యల చిక్కుముళ్లు ఒక్కొక్కటిగా వీడుతున్నాయి. మండల, రెవెన్యూ డివిజన్ స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. విరాసత్, వివరాల సవరణ, మ్యుటేషన్ వంటి వాటిని తహసీల్దారు సమక్షంలో పరిశీలించి అర్హత కలిగిన దరఖాస్తుదారులకు వెంటనే పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేస్తున్నారు. గ్రామాల్లో అసైన్డ్ భూముల వివరాలు నమోదు చేయాలని రెవెన్యూశాఖ నిర్ణయించింది. భూములు పొందినవారి పట్టాలను పరిశీలించటంతో పాటు ప్రభుత్వం పంపిణీ చేసిన భూముల్లో ఏళ్లుగా ఉంటున్నవారిని అధికారులు గుర్తించనున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని అసైన్డ్ భూముల లెక్కలు తేలనున్నాయి.

ఆగస్టు 10 నాటికే దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పూర్తిచేయాలనుకుంటున్నాం. మండల, రెవెన్యూ డివిజన్ స్థాయిలో పరిష్కారమైన వాటికి వెంటనే పాసుపుస్తకాలు ఇస్తున్నాం. సాదాబైనామా, అసైన్డ్, పీఓటీ దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన వాటిని గుర్తిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వాటిని పరిష్కరిస్తాం.
– మధు, ఆర్డీఓ, కొత్తగూడెం

మండలాల వారీగా పరిష్కారం..నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పూర్తిచేసేందుకు అధికారులు నడుం బిగించారు. మండలాల వారీగా వచ్చిన సమస్యల వివరాలు తీసుకుని అందులో సులువుగా పరిష్కారమయ్యే వాటికి ప్రాధాన్యమిస్తున్నారు. విస్తీర్ణాల హెచ్చుతగ్గులకు సంబంధించిన దరఖాస్తుదారులకు నోటీసులు ఇస్తున్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు అందుబాటులోకి వచ్చాక.. వాటినీ పరిష్కరించనున్నట్లు తెలుస్తోంది. మిస్సింగ్ సర్వే నంబర్లు, పట్టా భూమి ఉండి నిషేధిత జాబితాలో చేరిన వాటిపై దృష్టి సారిస్తున్నారు. ఆర్ఐ, తహసీల్దార్లు, ఇతర సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తున్నారు. సమస్య తీవ్రతను బట్టి ఆర్డీఓ, కలెక్టర్ లాగిన్‌కు చేరవేస్తున్నారు. ఉభయ జిల్లాల్లో సాదాబైనామా, అసైన్డ్ భూములు, గిరిజన, గిరిజనేతర భూవివాదాలు, పోడు సమస్యల దరఖాస్తులు అధికంగా ఉండటంతో వాటిని పరిశీలించి పక్కనపెడుతున్నారు.

# పర్యవేక్షిస్తేనే ఫలితాలు ఆశాజనం




ఖమ్మం : తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రం(టీహబ్) సేవలు ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. ఈ కేంద్రాల ద్వారా పేద, మధ్యతరగతి వర్గాలకు ఖరీదైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా లభిస్తున్నాయి. ఖమ్మం, కొత్తగూడెం సర్వజనాసుపత్రుల్లోని కేంద్రాలకు 134 రకాల పరీక్షలు చేసే సామర్థ్యం కలదు. ప్రస్తుతం 120 రకాల వరకు చేస్తున్నారు. రక్తపరీక్షలు, బయోకెమిస్ట్రీ, హిస్టోపాథాలజీ, మైక్రోబయాలజీ విభాగాల్లో పరీక్షలు జరిపేందుకు ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అయితే కేంద్రాల నిర్వహణపై పర్యవేక్షణ కొరవడటంతో 2024తో పోల్చితే 2025లో రోగులు, నమూనాల సేకరణ, వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోంది. ఉదాహరణకు ఖమ్మం జిల్లాలో 2024లో జనవరి నుంచి జులై వరకు 1,13,405 మంది రోగుల నుంచి 2,15,807 నమూనాలు సేకరించి 4,14,674 రకాల పరీక్షలు చేశారు. ఈ ఏడాదిలో 20 శాతానికి పైగా నమూనాలు తగ్గటం గమనార్హం.

ఖమ్మం జిల్లాలోని ప్రాథమిక, పట్టణ, బస్తీదవాఖానాలతో పాటు సర్వజనాసుపత్రి, ఈహెచ్ఎస్ క్లినిక్‌ల్లో చికిత్సలు పొందే రోగులకు చెందిన రక్తనమూనాలకు టీహబ్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తంగా 48 ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల నుంచి రోజూ నమూనాలు సేకరిస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో 29 పీహెచ్‌సీల పరిధి నుంచి రక్తనమూనాలు కొత్తగూడెంలోని టీహబ్‌కు చేరుతున్నాయి.

ఆరోగ్య కేంద్రాల నుంచి రక్తనమూనాలను టీహబ్‌కు చేర్చే వాహనాలు కొన్ని సందర్భాల్లో ఆగిపోవటం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో రోగులు ప్రైవేటు ప్రయోగశాలలు లేదా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి. 'వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఏ రోజుకు ఆరోజు నివేదికలు పంపిస్తున్నాం. అడపాదడపా సమస్యలు ఉత్పన్నమైనా వాటిని పరిష్కరిస్తున్నాం' అని కొత్తగూడెం టీహబ్ ఇన్‌ఛార్జి నజీరుద్దీన్‌కు తెలిపారు.

**తగ్గుదలకు కారణాలు..**

టీహబ్‌లో పరీక్షల నిర్వహణకు తరచూ ఆటంకం కలుగుతోంది. పరీక్షలకు అవసరమైన రీఏజెంట్ల సరఫరాలో జాప్యం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్ర వైద్యసేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్ఎంఐడీసీ) వీటిని సరఫరా చేస్తుంది. యంత్రాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తి మరమ్మతులు చేపట్టడానికి స్థానికంగా నిపుణులు లేకపోవటం సమస్యగా మారింది. ఏజెన్సీ ప్రాంతాల్లో చాలామందికి స్మార్ట్ ఫోన్లు ఉండకపోవటంతో పరీక్షల నివేదికలు సత్వరం అందటం లేదు. నేరుగా కొత్తగూడెం సర్వజనాసుపత్రికి వెళ్లినా సిబ్బంది సకాలంలో రిపోర్టులు ఇవ్వటం లేదని పలువురు వాపోతున్నారు.

# పదేళ్ల కల.. సాకారం దిశగా..!



కొత్తగూడెం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మీదుగా వెళ్తున్న కొన్ని జాతీయ రహదారులకు మహర్దశ పట్టనుంది. రాష్ట్రంలో కొత్తగా జాతీయ రహదారులు, బైపాస్ రోడ్లు, వంతెన నిర్మాణాలకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ ప్రణాళికలు రూపొందించింది. మొత్తమ్మీద 15 ఎన్‌హెచ్ పనులు చేపట్టనుంది. వీటిలో ఎన్‌హెచ్–30, 365, 563ను నాలుగు వరుసల రహదారులుగా మార్చటంతో పాటు కొత్తగూడెం– పాల్వంచ బైపాస్ నిర్మాణానికి ఇందులో చోటిచ్చింది. రాబోయే మూడేళ్లలో ఈ పనులను పూర్తిచేసేలా ఎన్‌హెచ్ఏఐ అధికారులు జాగ్రత్తలు తీసుకోనున్నారు.

**ఎట్టకేలకు మోక్షం..**

కొత్తగూడెం–పాల్వంచ నడుమ పదేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన బైపాస్ నిర్మాణానికి మోక్షం లభించింది. ఎన్‌హెచ్–30లో భాగంగా రుద్రంపూర్–భద్రాచలం సెక్షన్ మధ్య నాలుగు వరుసల రహదారితో పాటు కొత్తగూడెం–పాల్వంచ బైపాస్ నిర్మాణానికి కేంద్రం ప్రణాళిక రూపొందించింది. భద్రాచలం వైపు రాకపోకలు సాగించే భారీ వాహనాలు, బొగ్గు లారీలను కొత్తగూడెం మీదుగా కాకుండా ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించేందుకు 2008లో బైపాస్ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. రూ. 33కోట్లతో 2014లో పనులు ప్రారంభించారు. పాల్వంచలోని నవభారత్ నుంచి కొత్తగూడెం కార్పొరేషన్ పరిధి గంగాహుస్సేన్ బస్తీలోని పంట పొలాల వరకు రోడ్డు నిర్మించారు. ఆ తరువాత ఆపేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో 'బైపాస్' నిర్మాణం పట్టాలెక్కనుంది.

**మరోసారి నిరాశే..**

హైదరాబాద్ రింగ్‌రోడ్డు నుంచి వలిగొండ, తొర్రూరు, నెల్లికుదురు, మహబూబాబాద్, బయ్యారం, ఇల్లెందు మీదుగా కొత్తగూడెం క్రాస్‌రోడ్డు వరకు జాతీయ రహదారి 930పీ నిర్మించాలి. ఇందులో భాగంగా రూ. 700కోట్లతో కొత్తగూడెం–ఇల్లెందు మధ్య 44కి.మీ. రహదారి నిర్మాణం చేపట్టాలి. భూసేకరణ, అటవీ అనుమతులు లేక పనులు మొదలవటం లేదు. భారీ వాహనాల రాకపోకలతో రహదారి దెబ్బతినటంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా.. ఆచరణకు నోచుకోవటం లేదు. కేంద్రం తాజాగా గుర్తించిన జాతీయ రహదారుల్లో 930(పీ)కి చోటు కల్పించకపోవటంతో మరోసారి నిరాశే మిగిలింది.

**ఇక ప్రయాణం సాఫీగా..**ఖమ్మం నుంచి సత్తుపల్లి, వరంగల్ మధ్య ప్రయాణం సాఫీగా సాగనుంది. ఎన్‌హెచ్–365బీబీలో భాగమైన ఖమ్మం, కొణిజర్ల, వైరా, తల్లాడ, కల్లూరు, సత్తుపల్లి రోడ్డు, ఎన్‌హెచ్–563లో భాగంగా ఖమ్మం–వరంగల్ మధ్య నాలుగు వరుసల రహదారుల నిర్మాణానికి సర్కారు పచ్చజెండా ఊపింది. రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ, ఇరుకు రోడ్ల వల్ల చోటుచేసుకుంటున్న ప్రమాదాలను నివారించటానికి రహదారులను విస్తరించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో వినిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో వీటిని నాలుగు వరుసలుగా మార్చేందుకు మార్గం సుగమమైంది. హ్యామ్(హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) విధానంలో ఆర్‌అండ్‌బీ రహదారుల ఉన్నతీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కసరత్తు ప్రారంభించింది. ఇందులో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని ప్రధాన రహదారులకు స్థానం కల్పించింది.

# 'ఈ–వ్యర్థం..'అనర్థం

హైదరాబాద్: మహానగరానికి ఎలక్ట్రానిక్ వ్యర్థాల ముప్పు పెరుగుతోంది. ఏటా వ్యర్థాలు పోగుపడుతుంటే రీసైక్లింగ్‌లో సరైన విధానాలు అవలంబించక సవాళ్లు ఎదురవుతున్నాయి. వాడి పారేస్తున్న సెల్‌ఫోన్లు, టీవీలు, విద్యుత్తు పరికరాలు, కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. రీసైక్లింగ్ కేంద్రాలకు పంపడంలో పీసీబీ, మున్సిపల్, ఇతర విభాగాల అలసత్వం, ప్రజల్లో అవగాహన కల్పించకపోవడంతో కాలుష్యం పెరిగిపోతోంది. పారేసిన బ్యాటరీ ఓ జలాశయాన్ని కలుషితం చేస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**సింహభాగం నగరం నుంచే..**

ఎలక్ట్రానిక్ వ్యర్థాల ఉత్పత్తిలో తెలంగాణ ఇతర రాష్ట్రాలతో పోటీ పడుతోంది. తొలిసారిగా లక్ష మెట్రిక్ టన్నులను దాటి ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా తర్వాత దేశంలో మూడో అతిపెద్ద వ్యర్థాల ఉత్పత్తిదారుగా రాష్ట్రం నిలిచిందని లోక్‌సభలో పర్యావరణ, అటవీ, వాతావరణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. వ్యర్థాల ప్రాసెసింగ్‌లో ఉత్తర్‌ప్రదేశ్ తర్వాతి స్థానంలో ఉందని పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం నాటికి 1.19లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకుందని వెల్లడించింది. ఈ వ్యర్థాలన్నీ ఐటీ



రంగానికి కేంద్రంగా ఉన్న రాజధాని నుంచే ఉత్పత్తి అవుతున్నాయి.

**20శాతంలోపే..**

వ్యర్థాల రీసైక్లింగ్ కోసం కాలుష్య నియంత్రణ మండలి 31 సంస్థలకు అనుమతులివ్వగా అందులో 20కి పైగా రాజధాని పరిధిలోనే ఉన్నాయి. వీటికి ఏటా 2.25 లక్షల టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే సామర్థ్యం ఉంది. అయినా 40వేల మెట్రిక్ టన్నులకు మించి రీసైక్లింగ్ చేయడం లేదు. పీసీబీ విడుదల చేసిన నివేదిక ప్రకారం రాష్ట్రంలో 2023–24లో ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబులిటీ (ఈపీఆర్)లో భాగంగా 63,635 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను సేకరించారు. ప్రాసెస్ చేసిన ఈ వ్యర్థాల్లో బంగారం, రాగి, అల్యూమినియం, ఇనుము, వంటి లోహాలు 24,497 మెట్రిక్ టన్నులుండగా ఇతర వ్యర్థాలు 24,433 మెట్రిక్ టన్నులున్నాయని పేర్కొంది.

**కాలుష్యంతో సమస్యలిలా..**

ఎలక్ట్రానిక్ వ్యర్థాల్లో సీసం, పాదరసం, కాడ్మియం, క్రోమియం, బ్రోమినేటెడ్ ఫ్లేమ్ రిటార్డెంట్స్ వంటి విషపూరిత పదార్థాలుంటాయి. వీటిని రీసైకిల్ చేయకపోతే నేల, నీరు, గాలిని కలుషితం చేస్తాయి. సీసం నీటి వనరుల్లో కలిస్తే నీటి కాలుష్యానికి దారి తీయడంతో పాటు జలచరాల మనుగడను ప్రశ్నార్థకం చేస్తాయి. ఈ రసాయనాలు నేలలో చేరి దాని సారాన్ని దెబ్బతీస్తాయి. వీటిని కాల్చడం, అశాస్త్రీయ పద్ధతుల్లో రీసైకిల్ చేయడం వల్ల డైఆక్సిన్‌లు, ఫ్యూరాన్లు వంటి విషపూరిత వాయువులు విడుదలై గాలిని కలుషితం చేస్తాయి. దీంతో క్యాన్సర్, నాడీ వ్యవస్థ రుగ్మతలు, శ్వాసకోశ సమస్యలు, హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలకు దారితీస్తాయి.

# చేయూతనిస్తే.. చేతివాటం చూపారు

హైదరాబాద్ : ప్రముఖ ప్రభుత్వ పిల్లల ఆసుపత్రి నిలోఫర్‌లో వైద్య పరికరాలు, ధోబీఘాట్ యంత్రాల కొనుగోళ్లలో అవకతవకలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇక్కడ కీలక బాధ్యతలు నిర్వహించిన ఓ అధికారి అంతా తానై వ్యవహరించి నిధులు పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ విచారణకు ఆదేశించినట్లు సమాచారం. నిలోఫర్‌లో అదనపు భవనం, ముఖ్యమైన పరికరాల కొనుగోలు కోసం ఓ ప్రభుత్వ రంగ సంస్థ గతంలో సీఎస్ఆర్ కింద రూ. 20 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించింది. ప్రస్తుతం ఓపీ భవనం పక్కన రూ. 10 కోట్లతో కొత్త భవనం నిర్మిస్తున్నారు. మరో రూ. 10 కోట్లతో వైద్య పరికరాలు, ఇతర మౌలిక వసతులకు వినియోగించాల్సి ఉంది. నిబంధనల ప్రకారం టీజీఎంఐఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఈ పరికరాలను కొనుగోలు చేయాలి. ఇక్కడే సదరు అధికారి అత్యవసర పద్దు కింద ఈ నిధుల నుంచి పరికరాల కొనుగోలుకు శ్రీకారం చుట్టారు.

**నిబంధనలు తుంగలో తొక్కి**

తొలుత ఆసుపత్రిలోని ధోబీఘాట్‌లోని యంత్రాలను మార్చాలని నిర్ణయించి ఓ ప్రైవేటు సంస్థకు ఆ పనులను ఏకపక్షంగా అప్పగించినట్లు తెలుస్తోంది. గత సెప్టెంబరులో 60 కిలోలు, 100 కిలోల సామర్థ్యం



ఉన్న యంత్రాలను కొనుగోలు చేశారు. ఏవైనా యంత్రాలు డిస్పోజబుల్ చేసి కొత్తవి కొనాలంటే ఒక కమిటీ ఏర్పాటు చేయాలి. ఇక్కడ అదేమీ జరగలేదని తెలుస్తోంది. పాత యంత్రాలకు ఎలాంటి ధర లేకుండానే సదరు సంస్థకు అప్పగించినట్లు తెలుస్తోంది. పాత యంత్రాలు విక్రయించగా...వచ్చే నిధులు ఆసుపత్రి ఖాతాలో నమోదు కాలేదు. ఆడిట్‌లో ఈ విషయం తేలింది. ఇవే కాకుండా పలు పరికరాలను ఎలాంటి నిబంధనలు పాటించకుండా కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. సీఎస్ఆర్ కింద నిధులు ఇచ్చిన సంస్థనూ బురిడీ కొట్టించినట్లు తెలిసింది. అత్యవసరంగా పరికరాలు కొనుగోలు చేసినట్లు సదరు సంస్థకు బిల్లులు పంపిస్తూ... నిధులను ఆసుపత్రి అభివృద్ధి ఫండ్(హెచ్‌డీఎఫ్)కు బదిలీ చేయించినట్లు సమాచా రం. ఇలా మొత్తం రూ. 5–6 కోట్ల నిధులకు సంబంధించి అక్రమాలు జరిగినట్లు చెబుతున్నారు. ఈ విషయమై ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ విజయకుమార్‌ను ఫోన్‌లో వివరణ కోరగా.. ఈ అంశంపై తన వద్ద ఎలాంటి సమాచారం లేదని బదులిచ్చారు.

# నిరీక్షణకు సెలవు... రైతుకు సులువు !

నల్గొండ : వ్యవసాయ ఉచిత విద్యుత్తు కనెన్షన్ల మంజూరుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యుత్తు సంస్థ అధికారులు చకచకా సర్వీసులు రిలీజ్ చేస్తున్నారు. రాష్ట్రంలోనే నల్గొండ జిల్లాలో చాలా వరకు రైతులు వ్యవసాయ బోరు బావులపై ఆధారపడి వ్యవసాయం సాగిస్తున్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల కారణంగా నిత్యం బోర్లు తవ్విస్తునే ఉన్నారు. అదే స్థాయిలో ఉచిత విద్యుత్తు కోసం దరఖాస్తులు చేస్తున్నారు. వీటికి సరిపడ విద్యుత్తు నియంత్రికలు, స్తంభాలు, ఉపకేంద్రాల సామర్థ్యం పెంచడంలో కాస్త జాప్యం చోటు చేసుకుంది. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పలుమార్లు రాష్ట్రస్థాయి అధికారులతో చర్చలు నిర్వహించి.. విద్యుత్తు సామగ్రి, నియంత్రికలు దిగుమతి చేయించడం



లో చొరవ చూపి పెండింగ్ దరఖాస్తులకు మోక్షం కల్పించారు.

గతంలో రైతులు నెలలు, సంవత్సరాల తరబడి విద్యుత్తు కనెన్షన్ల కోసం నిరీక్షించేవారు. ప్రస్తుతం విద్యుత్తు సర్వీసులను ఒక్కో నెలకు నాలుగు, ఐదు వందల చొప్పున మంజూరు చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చాక ఏటా 6000కు పైగా కొత్త విద్యుత్తు సర్వీసులు మంజూరు చేస్తున్నారు. రైతులు సైతం కాలంలో సంబంధ లేకుండా బోర్లు వేస్తుండటంతో దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వచ్చి చేరుతున్నాయి.

**నిరంతర ప్రక్రియ**

వెంకటేశ్వర్లు, ఎస్ఈ, విద్యుత్తు సంస్థ నల్గొండ జిల్లా

ఉచిత విద్యుత్తు సర్వీసుల మంజూరు నిరంతర ప్రక్రియ. రాష్ట్రంలోనే నల్గొండ పెద్ద జిల్లా కావడంతో బోరుబావుల తవ్వకం సంఖ్య పెరిగిపోతుంది. విద్యుత్తు సర్వీసుల కోసం రైతుల నుంచి దరఖాస్తులు వస్తునే ఉన్నాయి. వాటిని త్వరగా పరిశీలించి మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

# రోగంతో.. వైభోగం

నల్గొండ : చండూరు మండలం బంగారిగడ్డకు చెందిన రాములు(పేరు మార్పు) నెల రోజుల క్రితం పురుగు మందు తాగడంతో బంధువులు పట్టణంలోని దేవరకొండ రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. నాలుగు రోజుల్లో రూ. 7.50 లక్షల బిల్లు వేశారు. బాధితుడు బతికాడు అనే ఆనందం కంటే జిల్లా కేంద్రంలో ఇంత ఖరీదైన వైద్యం ఉందా.. అనే విచారం కుటుంబ సభ్యుల్లో వ్యక్తమైంది.

పట్టణ పరిధిలోని చర్లపల్లి ప్రాంతానికి చెందిన నర్సమ్మకు కాలుకు చిన్న పుండు కావడంతో పది రోజుల క్రితం బస్టాండ్ ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. పుండుకు శస్త్రచికిత్స అంటూ వైద్యం చేసి రూ. 1.10 లక్షలు వసూలు చేశారు. ఇలాంటి బాధితులు నిత్యం పదుల సంఖ్యల్లో మోసపోతున్నారు.

జిల్లా కేంద్రంతో పాటు మిర్యాలగూడ, దేవరకొండ వంటి ప్రాంతాల్లో మల్టీస్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ అంటూ పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎక్కువ శాతం మంది కాసుల కోసం కక్కుర్తి వైద్యాన్ని నిర్వహిస్తున్నారు. సీజన్‌లో వచ్చే సాధారణ జ్వరాలు సైతం డెంగీ, మలేరియా అంటూ భయపెడుతూ రోగుల వద్ద రూ.లక్షలు గుంజుతున్నారు. జిల్లా కేంద్రంలో వైద్యకళాశాల ఏర్పాటు కాకముందు పదుల సంఖ్యల్లో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులు ఇప్పుడు 60 నుంచి 70 వరకు పెరిగాయి. నిబంధనల మేరకు ఆసుపత్రి చుట్టూ ఫైర్‌ఇంజిన్



వాహనం తిరగాలి. కానీ దేవరకొండ రోడ్డు, ప్రకాశంబజార్, గొల్లగూడ, మిర్యాలగూడలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న కాలనీల్లో కనీసం సైకిళు కూడా తిరగని పరిస్థితి ఉంది. ట్రాఫిక్ సమస్యలతో పాటు అంబులెన్సులు నిలిపే స్థలం లేక ఇతర ప్రాంతాల్లో నిలుపుతున్న ఆసుపత్రులు జిల్లాలో పదుల సంఖ్యలో ఉన్నాయి. య ప్రైవేటు ఆసుపత్రులకు రోగులు రావాలంటే మధ్యవర్తులకు పెద్ద మొత్తంలో కమీషన్లు ఇస్తున్నారు. పేరు మోసిన ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలతో పాటు మధ్యవర్తులకు ముందుగానే రూ.లక్ష చొప్పున అడ్వాన్స్ ఇస్తున్నారు. రోగులకు అయ్యే బిల్లులో వీరికి 20 నుంచి 25 శాతం కమీషన్ వస్తోంది.

జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రితో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న ఏరియా, ప్రాథమిక ఆసుపత్రులకు వచ్చే రోగులను కొందరు కింది స్థాయి సిబ్బంది తమకు తెలిసిన ప్రైవేటుకి పంపి కమీషన్లు తీసుకుంటున్నారు.

**ముమ్మర తనిఖీలు చేస్తున్నాం.**

డా. పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌వో నల్గొండ

నిబంధనల ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులకు అనుమతులు ఇస్తున్నాం. అధిక ఫీజులు వసూలు చేసే వారిపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులను ప్రత్యేక సిబ్బందితో తనిఖీ చేస్తున్నాం. ప్రతి ఆసుపత్రిలో ధరల పట్టిక పెట్టాలని సూచించాం. డెంగీ పరీక్షలు కేవలం జనరల్ ఆసుపత్రిలోనే జరుగుతున్నాయి. ప్రైవేటులో ఎక్కడా లేవు.

# చెంతనే జలం.. అదనపు ఆయకట్టుకు బలం



అశ్వాపురం : మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్ కాంక్రీట్ పనులు కొనసాగుతున్నాయి. రూ. 25కోట్లతో దీన్ని నిర్మిస్తున్నారు. 2023లో శంకుస్థాపన చేయగా.. ఈ ఏడాది జనవరిలో పనులు ప్రారంభమయ్యాయి. తుమ్మలచెరువుకు గోదావరి జలాల పంపిణీతో పాటు సీతారామ ప్రాజెక్ట్ పరిధిలోని 16,500 ఎకరాల అదనపు ఆయకట్టును స్థిరీకరించడమే దీని లక్ష్యం. స్థానికంగా అందించకుండా వేరే ఎక్కడికో గోదావరి జలాలను తరలించడం సరైంది కాదనే ఈ ప్రాంత రైతుల భావనలను కూడా ఈ పథకం దూరం చేయనుంది.

**ఏడు నెలల పాటు తవ్వకాలే..**

భీమునిగుండం కొత్తూరు గ్రామంలోని సీతారామ ప్రాజెక్ట్ ఫేజ్-1 పంప్‌హౌస్ దిగువన ఫోర్ బే వద్ద ప్రధాన కాలువపై ఈ పంప్‌హౌస్ రాఫ్ట్ నిర్మాణం కొనసాగుతోంది. ఏడు నెలల పాటు దీని పునాదుల తవ్వకాలే కొనసాగాయి. గట్టి రాయి పడటంతో పాటు మే నెలలో భారీ వర్షాలు తదితర కారణాల నేపథ్యంలో జాప్యం జరిగింది. ప్రధాన కాలువలో ఇక్కడ నీటిమట్టం 43 అడుగులు ఉంటుందనేది అంచనా. పంప్‌హౌస్ ద్వారా 85 అడుగుల ఎత్తు వరకు ఎత్తిపోయనున్నారు. 1.8 మెగావాట్ల రెండు విద్యుత్తు మోటార్లు, 2.5 క్యూమెక్స్‌ల సామర్థ్యం కలిగిన రెండు పంప్‌లు ఏర్పాటు చేయనున్నారు. సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ నుంచి పైన భూమి ఉపరితలం వరకు ఈ పంప్‌హౌస్ రాఫ్ట్ 30 నుంచి 35 అడుగుల ఎత్తు ఉంటుంది. వీటికి సంబంధించిన పనులే ఇప్పుడు కొనసాగుతున్నాయి. ఎత్తిపోతల పథకంలోని కీలకమైన భాగం ఇదే.

**రెండు కిలోమీటర్ల దూరంలో..**

పంప్‌హౌస్ నుంచి 2 కిలోమీటర్ల దూరంలో గొందిగూడెం ఇసుకవాగు ఉంటుంది. అక్కడి వరకు పైప్‌లైన్ నిర్మాణం జరుగుతుంది. ఇసుక వాగు సమీపంలో 90 మీటర్ల వద్ద ఎలివేషన్ పాయింట్ ఉంటుంది. ఇక్కడ ఎడమ, కుడి కాలువలు ఉంటాయి. ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు ఇసుక వాగులోకి వెళ్తాయి. తర్వాత దాని ద్వారా తుమ్మలచెరువులోకి చేరుతాయి. పునాదుల తవ్వకం పూర్తయి కాంక్రీట్ పనులు ప్రారంభమయ్యాయి. విద్యుత్తు మోటార్లు, పంప్‌ల ఏర్పాటు కీలకం. మిగిలిన పనులు త్వరగానే పూర్తవుతాయి. డిసెంబరులోగా తుమ్మలచెరువుకు గోదావరి జలాలను అందజేసేందుకు ప్రయత్నిస్తున్నాం. – డి.శ్రీనివాస్, డీఈ, సీతారామ ప్రాజెక్ట్

# ఆయుకట్టు.. కళకళ



ఖమ్మం : జిల్లాలో వరినాట్లు ఊపందుకున్నాయి. జులై ఆరంభంలో వర్షాలు సక్రమంగా కురవకపోవటంతో బోర్లు, బావుల కింద వెదజల్లే, నాటు పద్ధతిలో సాగు చేపట్టారు. సాగర్ కాల్వ ద్వారా కృష్ణాజలాలు విడుదలవటంతో ఆయకట్టు పరిధిలో రైతులు సన్నాహాలు ముమ్మరం చేశారు. రెండు వారాల్లో వరినాట్లు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు.

**వరి నాట్లు ముమ్మరం..**

జిల్లాలో ఈఏడాది వానాకాలంలో సుమారు 2.95 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు 1,98,949 (వెదజల్లే పద్ధతిలో 58,643 నాటు పద్ధతిలో 1,40,306) ఎకరాల్లో సాగైంది. మే మాసంలో వర్షాలు భారీగా కురవటంతో ఎక్కువ మంది రైతులు దుక్కులు సిద్ధం చేసుకున్నారు. జూన్‌లో ఆశించిన స్థాయిలో వానలు పడకపోవటంతో బోర్లు, బావులున్న అన్నదాతలు వెదజల్లే పద్ధతిపై దృష్టిసారించారు. సత్తుపల్లి, వైరా, కూసుమంచి వ్యవసాయ డివిజన్ల పరిధిలో గతంలో కంటే ఎక్కువ మంది వెదజల్లే పద్ధతిని అవలంబించారు.

ఈసారి జులైలో సగటుకు మించి వానలు కురిశాయి. అదే నెల 14న పాలేరు జలాశయం నుంచి ప్రధాన కాల్వకు నీటిని విడుదల చేశారు. సాగర్ గేట్లు ఎత్తాక నీటి విడుదల సామర్థ్యాన్ని పెంచటంతో ఆయకట్టుకు జలకళ వచ్చింది. వరినాట్లు ముమ్మరమయ్యాయి. ప్రస్తుతం పాలేరు జలాశయానికి 4వేల క్యూసెక్కుల కృష్ణాజలాలు వస్తుండగా.. అంతే మొత్తాన్ని ప్రధాన కాల్వకు వదలుతున్నారు. అవసరమైతే 8వేల క్యూసెక్కుల వరకు పెంచే అవకాశం ఉంది.

'ఎండల తీవ్రత అధికంగా ఉంది. అదుగున తేమ లేని ప్రాంతాల్లో రైతులు యూరియా బదులు నానో యూరియా పిచికారీ చేసుకోవాలి' అని డీఏఓ పుల్లయ్య సూచించారు. ముందస్తుగా వానలు కురవటంతో జూన్ మొదటి వారంలో వెదజల్లే పద్ధతిలో ఐదెకరాల్లో సాగు పనులు ప్రారంభించాం. తరువాత మండుటెండలు కాయటంతో ఒక ఎకరంలో విత్తనాలు మొలకెత్తలేదు. ప్రభుత్వం గోదావరి జలాలు అందించటంతో ఆ ఎకరంలో నాటు వేశాం. ఇప్పుడు కృష్ణాజలాలు వస్తుండటంతో ఈ సీజన్‌లో మా పంటలకు ఢోకాలేదు. నవంబరులో వచ్చే తుపాన్ల కంటే ముందుగానే పంటలు చేతికందుతాయి. మంచి దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నాం. – పువ్వాళ్ల రామారావు, ఎర్రబోయినపల్లి, కల్లూరు మండలం

# సేవలు ఉచితం.. పర్యవేక్షిస్తేనే ప్రయోజనం




ఖమ్మం : తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రం(టీహబ్) సేవలు ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. ఈ కేంద్రాల ద్వారా పేద, మధ్యతరగతి వర్గాలకు ఖరీదైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా లభిస్తున్నాయి. ఖమ్మం, కొత్తగూడెం సర్వజనాసుపత్రుల్లోని కేంద్రాలకు 134 రకాల పరీక్షలు చేసే సామర్థ్యం కలదు. ప్రస్తుతం 120 రకాల వరకు చేస్తున్నారు. రక్తపరీక్షలు, బయోకెమిస్ట్రీ, హిస్టోపాథాలజీ, మైక్రోబయాలజీ విభాగాల్లో పరీక్షలు జరిపేందుకు ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అయితే కేంద్రాల నిర్వహణపై పర్యవేక్షణ కొరవడటంతో 2024తో పోల్చితే 2025లో రోగులు, నమూనాల సేకరణ, వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోంది. ఉదాహరణకు ఖమ్మం జిల్లాలో 2024లో జనవరి నుంచి జులై వరకు 1,13,405 మంది రోగుల నుంచి 2,15,807 నమూనాలు సేకరించి 4,14,674 రకాల పరీక్షలు చేశారు. ఈ ఏడాదిలో 20 శాతానికి పైగా నమూనాలు తగ్గటం గమనార్హం.

**తగ్గుదలకు కారణాలు..**

టీహబ్‌లో పరీక్షల నిర్వహణకు తరచూ ఆటంకం కలుగుతోంది. పరీక్షలకు అవసరమైన రీఏజెంట్ల సరఫరాలో జాప్యం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్ర వైద్యసేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్ఎంఐడీసీ) వీటిని సరఫరా చేస్తుంది. యంత్రాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తి మరమ్మతులు చేపట్టడానికి స్థానికంగా నిపుణులు లేకపోవటం సమస్యగా మారింది. ఏజెన్సీ ప్రాంతాల్లో చాలామందికి స్మార్ట్ ఫోన్లు ఉండకపోవటంతో పరీక్షల నివేదికలు సత్వరం అందటం లేదు. నేరుగా కొత్తగూడెం సర్వజనాసుపత్రికి వెళ్లినా సిబ్బంది సకాలంలో రిపోర్టులు ఇవ్వటం లేదని పలువురు వాపోతున్నారు.

ఆరోగ్య కేంద్రాల నుంచి రక్తనమూనాలను టీహబ్‌కు చేర్చే వాహనాలు కొన్ని సందర్భాల్లో ఆగిపోవటం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో రోగులు ప్రైవేటు ప్రయోగశాలలు లేదా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి. 'వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఏ రోజుకు ఆరోజు నివేదికలు పంపిస్తున్నాం. అడపాదడపా సమస్యలు ఉత్పన్నమైనా వాటిని పరిష్కరిస్తున్నాం' అని కొత్తగూడెం టీహబ్ ఇన్‌ఛార్జి నజీరుద్దీన్‌కు తెలిపారు.

**ఆసుపత్రుల నుంచి సేకరణ**

ఖమ్మం జిల్లాలోని ప్రాథమిక, పట్టణ, బస్తీదవాఖానాలతో పాటు సర్వజనాసుపత్రి, ఈహెచ్ఎస్ క్లీనిక్‌ల్లో చికిత్సలు పొందే రోగులకు చెందిన రక్తనమూనాలకు టీహబ్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తంగా 48 ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల నుంచి రోజూ నమూనాలు సేకరిస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో 29 పీహెచ్‌సీల పరిధి నుంచి రక్తనమూనాలు కొత్తగూడెంలోని టీహబ్‌కు చేరుతున్నాయి.

# భూసార పరీక్షలు కరీంనగర్‌లోనే!

వేములవాడ : జిల్లాలోని రైతులకు భూసార పరీక్షల ఫలితాలు అందటంలో ఆలస్యం జరుగుతోంది. వేములవాడలోని భూసార పరీక్ష కేంద్రం మూతపడటంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా రైతులకు అందుబాటులో ఉండేలా వేములవాడలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 1998లో భూసార పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పడక ముందు సిరిసిల్ల, వేములవాడ, చందుర్తి, కోనరావుపేట, ఇల్లంతకుంట, బోయినపల్లి, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల రైతులకు భూసార పరీక్షల సేవలు ఈ కేంద్రం నుంచి అందేవి. కేంద్రంలోని ఏవో, సిబ్బంది బదిలీలపై వెళ్లడంతో తిరిగి నియమించలేదు. దీంతో పన్నెండేళ్ల క్రితం మూతబడిన కేంద్రం తిరిగి వినియోగంలోకి రావటం లేదు.

**మూలనపడ్డ కిట్లు** కేంద్రం మూతపడటంతో అందులోని పరీక్ష సామగ్రి తుప్పుపట్టి పనికి రాకుండా పోయాయి. పదేళ్ల క్రితం భూసార పరీక్షలకు అవసరమైన దాదాపు రూ. 5లక్షల విలువ గల పరికరాలను ప్రభుత్వం అందజేసింది. ఇప్పటి వరకు అవి అట్టపెట్టెల్లోనే మూలుగుతున్నాయి. ఎందుకు పనికిరాకుండా పాడై పోయాయి. జిల్లాలోని రైతులకు సంబంధించిన భూముల మట్టి నమూనాలు సేకరించిన వ్యవసాయ



అధికారులు కరీంనగర్‌లోని భూసార పరీక్ష కేంద్రానికి పంపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏకైన భూసార పరీక్ష కేంద్రం కరీంనగర్‌లోనే ఉండటంతో రైతులందరికీ సంబంధించిన మట్టి నమూనాలు ఆ కేంద్రానికే పంపిం చాల్సిన పరిస్థితి ఉంది. దీంతో అక్కడ పరీక్షలు ఆలస్యం కావటంతో రైతులకు సకాలంలో ఫలితాలు అందని ద్రాక్షగా మారాయి. క్లస్టర్ల వారీగా ప్రభుత్వం ఇచ్చిన భూసార పరీక్ష కిట్లు ఎప్పుడో మూలన పడ్డాయి.

**రైతులకు నష్టం**

భూసార పరీక్షలతో రైతులకు అనేక ప్రయోజనాలున్నాయి. పంట క్షేత్రాల్లోని మట్టిని సేకరించి భూసార పరీక్ష చేయించిన తరువాత వచ్చే ఫలితాలకు అనుగుణంగా పంటలు సాగు చేసి మంచి దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంది. పరీక్షలతో మట్టిలో ఎంత మోతాదులో భాస్వరం, నత్రజని, పొటాష్‌తో పాటు సూక్ష్మ పోషకాలు ఉన్నాయనే విషయం వెల్లడవుతోంది. ఆ ఫలితాలను భూముల్లో పంటల మార్పు, సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. అయితే ఫలితాల జాప్యంతో రైతులు నష్టపోతున్నారు. చేసేందేం లేక ఏదో ఒక పంట వేస్తున్నారు. ఇప్పటికైనా భూసార పరీక్ష కేంద్రాన్ని తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

**ప్రభుత్వానికి నివేదిక పంపాం– సాయికిరణ్, ఏఈవో, వేములవాడ**

వేములవాడలోని భూసార పరీక్ష కేంద్రం పనిచేయాలంటే ఒక ఏవో, సిబ్బంది అవసరం ఉంటుంది. పరికరాలు అందుబాటులో ఉన్నాయి. సిబ్బందిని నియమించి కేంద్రాన్ని ప్రారంభించాల్సిందిగా ప్రభుత్వానికి నివేదిక పంపాం.

# గుర్తించు.. మోసాలకు చెక్ పెట్టు

పెద్దపల్లి : సుల్తానాబాద్‌లోని ఓ సినిమా థియేటర్‌లో పలు ప్యాకింగ్ తినుబండారాలపై తయారీ తేదీ, ఎమ్మార్పీ లేకపోవడంపై వినియోగదారుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తూనికల, కొలతల అధికారులు కేసు నమోదు చేశారు. రామగిరి నాగేపల్లి ఐకేపీ కేంద్రంలో 41 కిలోల కంటే ఎక్కువ పరిమాణంలో ధాన్యం బస్తా తూకం వేయడంతో కేసు నమోదు చేసి రూ. 25 వేల జరిమానా విధించారు.

దుకాణాలు, బేకరీలు, హోటళ్లు ఇతర తినుబండారాలతోపాటు అన్ని రకాల ప్యాకేజీ ఉత్పత్తులలో వినియోగదారులకు జరుగుతున్న మోసాలను నియంత్రించేందుకు తూనికలు, కొలతల అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నారు. అయినా క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన లేకపోవడంతో పలు చోట్ల పలు రకాలుగా తూకాల్లో మోసాలు జరుగుతూనే ఉన్నాయి. వినియోగదారుడు నష్టపోతూనే ఉన్నారు.

**ఆయా చోట్ల ఇలా..**

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లా తూనికలు, కొలతలశాఖ అధికారులు 85 కేసులు నమోదు చేసి రూ. 3.17 లక్షలు జరిమానాలు వసూలు చేశారు. కిరాణ వీధి దుకాణాలు మినహా సరకులను విడిగా విక్రయించే పద్ధతి పోయింది. గ్రామస్థాయిలో కూడా సూపర్ మార్కెట్ల సంస్కృతి విస్తరించడంతో అందమైన ప్యాకెట్లతో సరకులను విక్రయిస్తున్నారు. వీటిపై తయారీదారుడి వివరాలు, ఎమ్మార్పీ, బరువు, తయారీ తేదీ, గడువు తేదీలను విడివిడిగా ముద్రించాలి. కానీ అవేవీ ఉండటం లేదు. పెట్రోల్‌బంకుల్లో మోసాలు జరుగుతున్నాయి. మీటర్ రీడింగ్ ట్యాంపరింగ్ చేస్తున్న ఘటనలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. అనుమానం వచ్చినప్పుడు అక్కడి సిబ్బంది ద్వారా పరీక్షించుకోవచ్చు.



హోటళ్లలో కొనుగోలు చేసే స్వీట్లు, బ్రెడ్డు ప్యాకెట్లపై బరువు, గడువు తేదీ ఉండటం లేదు.

వీటిపై అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. దీంతోపాటు నిత్యం తనిఖీలు, ఫిర్యాదు చేసిన వెంటనే చర్యలు తీసుకోవడం ద్వారా వీటికి అడ్డుకట్ట వేసే అవకాశం ఉంది.

**గ్రామీణ ప్రాంతంలో ఎక్కువ**

– విశ్వేశ్వర్, జిల్లా తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్

గత ఏప్రిల్ నుంచి జులై వరకు జిల్లాలో వివిధ కేసుల్లో రూ. 3.17 లక్షల జరిమానా విధించాం. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులు ఎక్కువగా ఉండటం, ప్యాకింగ్ నిబంధనలు తెలియకపోవడంతో వినియోగదారులు మోసాలకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఎమ్మార్పీని తొలగించి, స్టిక్కర్లు అతికించి అధిక ధరలకు విక్రయించడంలాంటివి చేస్తున్నారు. ఇలా చేయడం నేరం. ఆయా సందర్భాల్లో ఫిర్యాదు చేస్తే స్పందించి వారిపై కేసులు నమోదు చేస్తాం.

# ఉపాధికి స్వాగతం

సారంగాపూర్: డిగ్రీ పట్టాలు పొందిన విద్యార్థులు చదువుకు తగిన ఉద్యోగాలు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సంప్రదాయ కోర్సులు చేసిన వారికి సరైన ఉపాధి అవకాశాలు లేవు. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ, విశ్వవిద్యాలయ (గ్రాంట్స్) కమిషన్(యూజీసీ) ఆధ్వర్యంలో వృత్తిరీత్యా కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిలో చేరిన విద్యార్థులు రెండేళ్ల పాటు కళాశాలలో చదివి.. మూడో సంవత్సరం కోర్సుకు సంబంధించిన కంపెనీల్లో అప్రెంటిస్‌షిప్ చేయవచ్చు. శిక్షణ, నైపుణ్యం ఆధారంగా అదేచోట ఉద్యోగం కూడా పొందవచ్చు. ఇతర కంపెనీల్లో కూడా ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి.

**ఇంటర్ విద్యార్థులు అర్హులు**

ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు బీకామ్ 'ఈ-కామర్స్ ఆపరేషన్స్' కోర్సు ఎంచుకోవచ్చు. ఆన్‌లైన్, షోరూం తదితర ప్రముఖ కంపెనీల్లో 'సేల్స్ సెక్టార్‌లో ఉపాధి అవకాశాలు ఉంటాయి. బీఎఫ్ఎస్ఐ(బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్) ద్వారా బ్యాంకింగ్ ఆపరేషన్, ఇన్సూరెన్స్, ఫైనాన్షియల్ మేనేజ్ మెంట్‌లో ఉద్యోగాలు దొరుకుతాయి. బీఎస్సీ హెచ్ఎస్ఎం(హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్)తో హెల్త్ కేర్ అడ్మినిస్ట్రేటర్, హాస్పిటల్ మేనేజర్, హెల్త్ ఇన్సూరెన్సు అనలిస్టు, మెడికల్ ఆఫీస్ మేనేజర్, పబ్లిక్ హెల్త్ ప్రోగ్రాం మేనేజర్, హెల్త్ డాటా అనలిస్టు, క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్, హెల్త్ కేర్




మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ అవకాశాలు లభిస్తాయి. ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య బీమా, మెడికల్ టూరిజం కంపెనీలు, క్లినికల్ పరిశోధనా సంస్థలు, వైద్యారోగ్య శాఖ, హెల్త్ టెక్ స్టార్టప్స్‌లో స్థిరపడవచ్చు. బైపీసీ, సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూతో పాటు వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులు. ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, ఎంపీహెచ్(మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్), ఎమ్మెస్సీ(హెల్త్ అడ్మినిస్ట్రేషన్), పీజీ డిప్లొమా - క్లినికల్ రీసెర్చ్, హెల్త్ ఎకనామిక్స్, హెల్త్ ఇన్ఫర్మాటిక్స్ వంటి ఉన్నత విద్యా కోర్సులు కూడా చేయవచ్చు.

**స్టైఫండ్ అందజేత**

బోర్డు ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్(బోట్) వారు మూడో ఏడాది కంపెనీలో శిక్షణ పొందుతున్న ప్రతి విద్యార్థికి, ఆయా కంపెనీలకు రూ.4వేలు చొప్పున చెల్లిస్తారు. పట్టా చేతికందాక రెండు పదుల వేతనంతో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.

**కోర్సులు అందుబాటులో ఉన్న కళాశాలలు**

గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల (మూడు కోర్సులు)
కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాల(బీకాం రిటైల్ ఆపరేషన్స్)
గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల(బీఎస్సీ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్)
మంథని డిగ్రీ కళాశాలబీఎఫ్ఎస్ఐ(బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్)

**శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు**

నూతన కోర్సులు అభ్యసిస్తే అప్రెంటిస్‌షిప్ ఆధారిత ఉద్యోగాలు పొందవచ్చు. విద్యార్థులు ఒకసారి ఈ కోర్సు ఎంచుకున్న తర్వాత.. రెండేళ్లు కళాశాలలో చదివి.. హైదరాబాద్‌లో మూడో సంవత్సరం అప్రెంటిస్‌షిప్ శిక్షణ పొందాలి. ప్రతినెల బోర్డు ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ నిర్వాహకులు రూ.4వేలు అందజేస్తారు.

జైకిషన్ ఓజా, ప్రిన్సిపల్, ఖని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల

# ఆర్డర్లు దండిగా.. కార్మికులు అరకొరగా

సిరిసిల్ల: జిల్లా వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వ ఆర్డర్ల కేటాయింపులు జరిగాయి. రెండు విడతలుగా 4.24 కోట్ల మీటర్ల మహిళా సంఘాల చీరలు 130 మ్యాక్స్ సంఘాలకు ఆర్డర్లు ఇచ్చారు. గతనెల చేనేత, జౌళిశాఖ ఉన్నతాధికారులు మీటరుకు రూ.34 చొప్పున ఉత్పత్తి ధర నిర్ణయమైంది. దీనితర్వాత ప్రింటింగ్, ప్రాసెసింగ్ ప్రక్రియ కూడా ఉంటుంది. పరిశ్రమలో ప్రభుత్వ, ప్రైవేటు ఆర్డర్లు ఉత్పత్తికి సరిపడా కార్మికులు లేరు. అధిగమిస్తేనే ఉత్పత్తిలో వేగం పుంజుకుటుంది. **లక్ష్యం ఇలా..** రాష్ట్రంలోని మహిళా సంఘాలకు ఆగస్టు 15న లాంఛనంగా చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలివిడత ఒక్కో చీరను అందించాలని ప్రణాళికలు చేస్తోంది. జిల్లాలో డాబీ, జకార్డు పరికరాలు అమర్చిన 17 వేల మరమగ్గాలపై రోజుకు లక్ష మీటర్ల చీర వస్త్రం ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం. ప్రస్తుతం నాలుగువేల మగ్గాలపై రోజుకు గరిష్ఠంగా 30 వేల మీటర్లకు మించి ఉత్పత్తి కావడం లేదు. గతంలో మాదిరిగా ఒత్తిడి లేకపోవడం.. సొంత ఉత్పత్తులు చేస్తూనే చీరలపై దృష్టి పెట్టడంలో ఆలస్యమవుతోంది. మొన్నటి వరకు నూలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురయ్యాయి. రాత్రి సమయంలో విద్యుత్తు దీపాల వెలుతురులో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.

**ఏడు కంపెనీల నూలు**

చీరల ఉత్పత్తిలో ఉపయోగించే నూలును నేషనల్ హ్యాండ్‌లూం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ధ్రువీకరించిన ఏడు కంపెనీల ద్వారా సరఫరాకు టెస్కో ఒప్పందం చేసుకుంది. 130 మ్యాక్స్ సంఘాల్లో 83 సంఘాలు సొంతంగా నూలు కొనుగోలు చేయాల్సి ఉండగా పెట్టుబడిలేక ఆర్థికంగా వెనకబడిన 47 మ్యాక్స్ సంఘాలకు చేయూతనిచ్చేందుకు నూలు బ్యాంకులో నూలు అందుబాటులో ఉంచారు. వీటిలో వారి ఉత్పత్తి సామర్థ్యాన్ని బట్టి టెస్కోకు డీడీలు చెల్లించిన వారికి విడతల వారీగా నూలు సరఫరా చేస్తున్నారు.

**పక్క జిల్లాలవారు వస్తేనే..**

జిల్లా వస్త్ర పరిశ్రమలో కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దాదాపు రెండేళ్లుగా అరకొర ఉత్పత్తులతో నెట్టుకొస్తున్న కార్మికులకు ప్రస్తుతం పరిశ్రమలో సొంత ఉత్పత్తులకు ప్రభుత్వ ఆర్డర్లు తోడవడంతో ఉపాధికి కొదువలేదు. గతంలో బతుకమ్మ చీరల ఉత్పత్తి సమయంలో ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలు.. జిల్లాల నుంచి నేతన్నలు ఇక్కడికి వచ్చేవారు. ప్రభుత్వం ఏకరూప దుస్తులు, మహిళా సంఘాల చీరలు, ఇతర ఆర్డర్లతో ఏడాదిలో గరిష్ఠంగా ఎనిమిది నుంచి తొమ్మిది నెలలు ఇక్కడ పని లభిస్తుంది. ఇప్పటికే మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝార?ండ్ రాష్ట్రాల నుంచి వెయ్యి మంది కార్మికులు సిరిసిల్లకు వచ్చారు. వీరిలో చాలా వరకు పాలిస్టర్, కాటన్ ఉత్పత్తులు చేస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి చీరలు నేసేందుకు రెండువేల మందికిపైన వస్తేనే వస్త్రోత్పత్తుల్లో వేగం పెరుగుతుంది. సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని.. ఉత్పత్తి పెంచేలా చర్యలు తీసుకుంటామని జిల్లా చేనేత, జౌళిశాఖ అదనపు సంచాలకులు రాఘవరావు పేర్కొన్నారు.

# అభ్యసనంలో తడబాటు!



పెద్దపల్లి : విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు విద్యాశాఖ చేపట్టిన ప్రయత్నం ఫలించడం లేదు. రాష్ట్ర, జాతీయ సగటుతో పోలిస్తే జిల్లా వెనకబాటుకు గురైంది. ఇటీవల 3, 6, 9వ తరగతి విద్యార్థులకు అభ్యసన సామర్థ్య పరీక్షలు నిర్వహించగా అన్నింటిలో ఆశించిన స్థాయిలో మార్కులు సాధించలేదు. జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి విడుదల చేసిన పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్-2024 నివేదిక ఆందోళన కలిగిస్తోంది. తరగతికి తగిన అభ్యసన సామర్థ్యాలు కొరవడినట్లు స్పష్టమవుతోంది. బాలుర కంటే బాలికల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగ్గానే ఉండటం విశేషం.

**సర్వేలో ప్రధానాంశాలు ఇలా..**

జిల్లాలో 88 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 331 ఉపాధ్యాయులు, 2,228 విద్యార్థులు సర్వేలో భాగస్వాములయ్యారు.
బాలురతో పోలిస్తే బాలికల అభ్యసన సామర్థ్యాలు మెరుగ్గా ఉన్నాయి.
బాలికలు 54 శాతం, బాలురు 46 శాతం నమోదు అయ్యాయి.
పట్టణ ప్రాంతాల్లో విద్యార్థుల్లో 58 శాతం, గ్రామీణంలో 42 శాతం సామర్థ్యాలు కలిగి ఉన్నాయి.
ప్రైవేటులో 48 శాతం ఉండగా ప్రభుత్వం 44, ఎయిడెడ్ 4, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని పాఠశాలల్లో 4 శాతం ఉంది.
సామాజికవర్గాలవారీగా పరిశీలిస్తే ఎస్సీ 22, ఎస్టీ 5, ఓబీసీ 62, ఇతరులు 9 శాతం ఉన్నాయి.

ఇలా చేస్తే మెరుగు

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధనలో లోతైన విజ్ఞానం అందించాలి.
బోధనోపకరణాలతో విద్యార్థులను సన్నద్ధం చేయాలి.
వెనకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
తల్లిదండ్రులను భాగసామ్యం చేస్తూ బడులను బలోపేతం చేయాలి.

# ప్రధాన రహదారిపై ఆక్రమణల జోరు



కోరుట్ల: జిల్లాలో జనాభా పరంగా రెండో పెద్ద పట్టణమైన కోరుట్ల రోజురోజుకూ విస్తరిస్తోంది. రహదారుల విస్తరణ, మౌలిక వసతుల కల్పనలో బల్దియా అధికారులు విఫలమవుతున్నారు. పట్టణంలోని జాతీయ రహదారిపై అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకోవడం లేదు.

**రద్దీతో తరచూ ప్రమాదాలు**

రోడ్లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను బల్దియా అధికారులు 'మామూలు'గా చూస్తూ వీఎల్‌టీ నంబర్లు కేటాయించి పన్నులు వసూలు చేస్తున్నారు. ఆ నంబర్ల ఆధారంగా విద్యుత్తు అధికారులు మీటర్లు మంజూరు చేస్తున్నారు. ఆక్రమణలతో రహదారి కుచించుకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మెట్‌పల్లి రోడ్‌లో రద్దీతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై పురపాలక సంఘం పట్టణ ప్రణాళిక విభాగం అధికారి ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా 100 అడుగుల లోపు చేపట్టిన నిర్మాణాలకు, రేకుల షెడ్లన్నింటికీ నోటీసులు జారీ చేస్తున్నామని చెప్పారు. రహదారిపై వంద అడుగుల వరకు మార్కింగ్‌ను ఇస్తున్నామని, త్వరలోనే ఆక్రమణలు తొలగింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**40-50 అడుగులలోపే నిర్మాణాలు**

కోరుట్లలో ప్రధాన రహదారి మెట్‌పల్లి రోడ్‌లోని కొత్త సురేశ్ రైస్‌మిల్లు నుంచి పట్టణ శివారులోని పశువైద్య కళాశాల వరకు, సాయిబాబా ఆలయ కూడలి తర్వాత నుంచి పట్టణ శివారులోని పాలిటెక్నికల్ కళాశాల వరకు విస్తరించి ఉంది.
పురపాలక నిబంధనల ప్రకారం రహదారికి ఇరువైపులా 100 అడుగులు వదిలిన తర్వాతే నిర్మాణాలు చేపట్టాలి. ఇరువైపులా కేవలం 40-50 అడుగులలోపే నిర్మాణాలు జరుగుతున్నాయి.
శాశ్వత, తాత్కాలిక షెడ్లను రేకులతో నిర్మించుకొని దుకాణాల నిర్వహణకు అద్దెకు ఇస్తున్నారు. ప్రధాన రహదారిని ఆనుకునే భారీగా షెడ్లు వేసుకొని వినాయక విగ్రహాల తయారీ దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

# ముసురుకుంటున్న వ్యాధులు



కొత్తగూడెం : మన్యంలో వారం రోజులుగా కురిసిన చెదురుమదురు వానలతో అపరిశుభ్రత తాండవిస్తోంది. జ్వర బాధితులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వ దవాఖానాల్లో డెంగీ కేసులు అంకెల్లో నమోదైతే.. అనధికారికంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో వాటి సంఖ్య పది కంటే ఎక్కువగా ఉందని సమాచారం. ఈనెల 1 నుంచి 7 వరకు జిల్లావ్యాప్తంగా 29 పీహెచ్‌సీలు, 6 సీహెచ్‌సీలు, 245 సబ్ సెంటర్ల పరిధిలో 5,983 మంది జ్వరాల బారిన పడ్డారు. దగ్గు, జలుబు, కీళ్ల నొప్పులు, ఒళ్ల నొప్పులు వంటి సమస్యలతో సతమతమవుతున్నారు. రీ డెంగీ, ఇతర జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వైద్యనిపుణుల సలహాలు, సూచనలతో వైద్యపరీక్షలు చేయించుకోవాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాం. టీ హబ్ ద్వారా అన్నిరకాల వైద్యపరీక్షలు చేయించేందుకు వెసులుబాటు ఉంది. జ్వర బాధితుల నుంచి రక్తనమూనాలు సేకరించి పీహెచ్‌సీల ద్వారా టీ హబ్‌కు పంపించాలని సిబ్బందికి సూచించాం.

– డాక్టర్ ఎస్.జయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ

**పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి**

వర్షాలతోనే కాకుండా లీకేజీ సమస్యలతో వృథా అవుతున్న తాగునీటి కారణంగా కొన్నిప్రాంతాల్లో మడుగులు ఏర్పడుతున్నాయి. అలాంటి నీటి ఊటల్లోనే డెంగీ, చికున్‌గన్యా వంటి జ్వరకారక దోమలు వృద్ధి చెందుతున్నాయి. బహిరంగ ప్రదేశాలు, వీధుల్లో ఇళ్ల నడుమ పిచ్చిమొక్కలు, మురుగుకాల్వల్లో పూడిక తొలగించేందుకు నగరపాలిక/పురపాలిక, గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలి. ఇంటా, బయట పారిశుద్ధ్య చర్యలపై ప్రజలు దృష్టి సారించాలి.

# జనమే బలం.. నిరూపించాలి మనం..!

కొత్తగూడెం: కొన్నేళ్లుగా దక్షిణాది రాష్ట్రాల్లో జనాభాను పెంచటంపై జోరుగా చర్చ సాగుతోంది. ఆర్థికాభివృద్ధికి అధిక జనాభా ఆటంకం అనే భావన నుంచి అభిలషణీయమైన జనాభా పెరుగుదల అభివృద్ధికి ఊతమనే వాదన తెరపైకి వచ్చింది. జనాభాను నియంత్రించటమనేది రాజకీయంగానే కాకుండా ఆయా ప్రాంతాల ప్రగతి కారకాలపై ప్రభావం చూపుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గతంలో జనాభా నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాయి. 'ఒక్కరు ముద్దు, ఇద్దరు హద్దు.. ముగ్గురు వద్దు' అంటూ భారత్ చాలా ఏళ్లుగా నినదిస్తోంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు ప్రస్తుతం అధిక మంది యువతతో అభివృద్ధిలో దూసుకుపోతున్నప్పటికీ సంతానోత్పత్తి రేటు క్షీణిస్తుండటం పెనుసవాల్‌గా మారనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాలక్రమేణా వృద్ధుల సంఖ్య పెరిగి, యువత శాతం క్షీణిస్తుందని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితులు ఎదురుకావటం వల్లే అనేక దశాబ్దాల పాటు పాటించిన ఏక సంతానం నిబంధనను చైనా తొలగించిందని గుర్తుచేస్తున్నారు. దృష్టిసారిస్తేనే మనుగడప్రభుత్వాలు జనాభా పెరుగుదలను ప్రోత్సహించాలని చెబుతున్నా.. జీవన వ్యయాలకు జడిసి చాలా జంటలు ఒకరికి మించి కనే ధైర్యం చేయలేకపోతున్నాయి. ఇందుకు నిరుద్యోగం ప్రధాన సమస్యగా మారుతోంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ప్రస్తుతం 40శాతానికి పైగా జనాభా వయస్సు 35ఏళ్ల లోపే. వీరందరినీ మేలిమి మానవ వనరులుగా తీర్చిదిద్దటంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. యువతలో నైపుణ్యాలను ఇతోధికం చేయాలి. అప్పుడే భారీ జన సంఖ్య జిల్లాలకు నిజమైన శక్తిగా నిలుస్తుంది. కలవరపరుస్తున్న జననాల రేటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గడిచిన నాలుగు దశాబ్దాలతో పోల్చితే జననాల రేటు భారీగా తగ్గినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 1971-81 మధ్య 27.88శాతం ఉన్న జనాభా వృద్ధి రేటు 2011-21 మధ్య 6.87శాతానికి పడిపోయింది. 2031 నాటికి 3శాతానికి పరిమితమవుతుందని అంచనా. సంతానోత్పత్తి రేటు కలవరపరుస్తోంది. 1971లో 5 శాతంగా ఉన్న టీఎఫ్ఆర్(టోటల్ ఫర్టిలిటీ, 1.8శాతానికి తగ్గింది.

# రాయితీ యంత్రం వైపు..రైతు నేత్రం

నల్గొండ : రాయితీ వ్యవసాయ యంత్ర పరికరాల పథకానికి పలువురు దరఖాస్తు చేసినా.. నేటికీ అవి అందలేదు. ఈ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా 2.63 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారు. నల్గొండ జిల్లాలో ప్రచారం కొరవడటం, గడువు తక్కువగా ఉండటంతో అధిక సంఖ్యలో రైతులు అర్జీలు సమర్పించలేకపోయారు. త్వరలో వానాకాలం పంటలు మొదలుకానున్న నేపథ్యంలో అన్నదాతలు రాయితీ పరికరాల కోసం ఎదురు చూసున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరోసారి దరఖాస్తులకు అవకాశం కల్పించడటంతో పాటు గతేడాది మంజూరు చేసిన నిధులకు ఈ సంవత్సరం అదనంగా కేటాయిస్తే ఎక్కువ మంది రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.
2024-25 సంవత్సరానికి సంబంధించి రాయితీ వ్యవసాయ పరికరాల కోసం నల్గొండ జిల్లాలో 820 యూనిట్లకు రూ.1.80 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటి మంజూరుకు అర్హులైన మహిళా రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలిచ్చింది. ఏఈవోల ద్వారా తీసుకున్నారు. అంతలోనే ఆర్థిక సంవత్సరం ముగియడంతో నిధులు వెనక్కివెళ్లాయి. గత ప్రభుత్వం హయాంలో ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 50 శాతం రాయితీపై పరికరాలు అందేవి. నిధుల కొరత



వల్ల ఈ పథకం ఆగిపోయింది. యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని పునరుద్ధరించాలని ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించింది. రాయితీతో వ్యవసాయ సంబంధ యంత్రాలు, పరికరాలు అందించాలని భావించింది. కానీ నిధులు మంజూరు కాకపోవడంతో రైతులంతా వాటికోసం ఎదురు చూస్తున్నారు.
పవర్ స్ప్రేయర్లు, పవర్ టిల్లరు, డ్రోన్లు, రోటోవేటర్లు, పవర్ వీడర్స్, బ్రష్‌కట్టర్స్, ట్రాక్టర్లు, విత్తనాల, ఎరువుల వేసే యంత్రాలు, దమ్ము, బోదలు చేసే పరికరాలు, బ్యాటరీ స్ప్రేయర్ యంత్రాలను ప్రభుత్వం రాయితీపై అందించనుంది. యంత్ర పరికరాల కోసం మహిళా రైతుల నుంచి దరఖాస్తులు ఏఈవోల స్థాయిలో తీసుకున్నారు. ఆర్థిక సంవత్సరం ముగియడంతో దరఖాస్తులు వారి వద్దనే ఉన్నాయి. రైతులు మాత్రం యంత్రపరికరాల కోసం ఎదురు చూస్తున్నారు. మంజూరు అయిన యంత్ర పరికరాలను డీలర్లు అప్పటికే తయారు చేసి పెట్టారు. జిల్లాలో సుమారు 1500 మంది మహిళా రైతులు దరఖాస్తులు చేసుకున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

**నిధులు రాగానే..** మార్చిలో రాయితీ యంత్ర పరికరాల కోసం మహిళ రైతుల నుంచి దరఖాస్తులు ఏఈవోల ద్వారా తీసుకున్నాం. వాటికి నిధులు రాగానే పంపిణీ చేస్తాం. పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

# నిధులందవు.. నిర్మాణాలు సాగవు

ధర్మపురి: గతంలో ఈ రహదారిని సీసీ రోడ్డుగా మార్చేందుకు ప్రతిపాదించగా.. రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే కేవలం 15 శాతమే పనులు పూర్తయ్యాయి. రోడ్డు పక్కన తవ్వి వదిలేయడంతో ఆసుపత్రికి వెళ్లే రోగులు, నది స్నానానికి వెళ్లే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇదేకాక ధర్మపురి పట్టణంలో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పలు పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి. దీంతో స్థానికులు తమ ఇంటి ఎదుట కంకరతో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి మీదుగా వెళ్లే రహదారిపై వేలాది భక్తుల వాహనాలు గోదావరికి వెళ్తుంటాయి.

**భక్తుల ఇబ్బందులు**

పట్టణంలోని తెనుగువాడ నుంచి బ్రాహ్మణసంఘం వరకు రెండు వరుసల రహదారి నిర్మాణానికి రూ.1.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 280 మీటర్ల వెడల్పుతో రెండు వైపులా మురుగు కాలువలు నిర్మించగా.. రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఎక్కువగా వాహనాలు ఇదే రహదారి నుంచి బ్రాహ్మణసంఘం, దేవస్థానం వరకు పెద్దఎత్తున వెళ్తుంటాయి. రహదారి నిర్మాణం ఆగిపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



**ప్రమాదకరంగా..**

అంబేద్కర్ కూడలి నుంచి అక్కపల్లి దేవస్థానం వరకు రోడ్డు వేసేందుకు రూ.కోటి నిధులు మంజూరు చేశారు. రెండు చోట్ల కల్వర్టులు నిర్మించారు. కేవలం 30 శాతం పనులు పూర్తవగా, మిగతావి నిలిచిపోయాయి. ఏడాదికిపైగా కంకర తేలి ఆయా కాలనీ ప్రజలకు అసౌకర్యంగా ఉంది.

**కంకర పోసి.. వదిలేసి**

పట్టణంలోని వివేకానంద కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నాలుగు వరుసల రహదారి ఏర్పాటుచేసి, మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించగా.. దీనికి రూ.6 కోట్ల నిధులు గతంలో మంజూరు చేశారు. అయితే రెండు వైపులా కంకర పోసి నిధులు విడుదల కాక వదిలేశారు. దీంతో రహదారి ప్రమాదకరంగా మారింది. అర్ధాంతరంగా నిలిచిన పనులను వెంటనే పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**ప్రతిపాదనలు పంపించాం**

నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. వీటిని పూర్తి చేసేందుకు మళ్లీ ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదల కాగానే పనులు చేపడతాం. రాజశేఖర్, పురపాలక కమిషనర్ ధర్మపురి




## త్వరలో జిల్లాల పేర్లు మార్పు.. అనగాని సత్యప్రసాద్ కీలక వ్యాఖ్యలు...

అమరావతి: ఏపీ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకునేందుకు.. సిద్ధం అయ్యింది. ఈ మేరకు రాష్ట్రంలో జిల్లాల పేర్లు మార్పు.. సరిహద్దుల మార్పులపై కసరత్తు చేస్తుంది. ఈనెల 13వ తేదీన జీవోఎం భేటీ కానుంది. తాజాగా ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో జిల్లాల పునర్విభజనకు సంబంధించిన అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రస్తావించడం, నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని కేబినెట్ సబ్ కమిటీని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ప్రజల నుండి వినతులకు ఆహ్వానిస్తున్నట్లు మంత్రి సత్యప్రసాద్ తెలిపారు. అయితే.. ఈ పేర్ల మార్పుతో జిల్లాల సంఖ్య పెరుగుతుందనే చర్చ జరుగుతోంది. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాల పునఃవ్యవస్థీకరణ చేసినప్పుడు ఒక నియమం అంటూ.. పాటించకుండా అడ్డదిడ్డంగా చేశారని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. కానీ ఇప్పుడు నియమనిబంధనలతో మేధావుల సూచనల మేరకు జిల్లాల పేర్ల మార్పు.. సరిహద్దుల మార్పులకు పూనుకున్నట్లు తెలిపారు. జిల్లా పేర్లు మార్పు విషయంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న జిల్లాలకు పేర్లు పెట్టడంలోనూ వివాదాలు తలెత్తాయని మంత్రి చెప్పుకొచ్చారు. జిల్లా, మండల, గ్రామాల పేర్లను మార్చాలంటూ.. వాటి సరిహద్దులు మార్చాలంటూ.. ప్రజలు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వానికి పదే పదే విన్నవించుకున్నారని మంత్రి సత్యప్రసాద్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో పరిష్కార మార్గాలను చూపేందుకు మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో పాటు మరో ఆరుగురి మంత్రుల బృందంతో జీవోఎం కమీటీని కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. కమిటీ ఈనెల 13వ తేదీన మొదటిసారి సమావేశం కానున్నట్లు పేర్కొన్నారు. కావున.. ప్రజలు, ప్రజా ప్రతినిధులు.. జిల్లా, మండల, గ్రామాల పేర్ల మార్పు, సరిహద్దుల మార్పుపైన వారి వినతులను సచివాలయానికి వచ్చి జీవోఎం కమిటీకి సమర్పించవచ్చు అని వివరించారు. ఈ జీవోఎం కమిటీలో మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, నీటి వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సభ్యులుగా ఉన్నట్లు మంత్రి అనగాని వివరించారు. ప్రతి ఒక్కరూ జిల్లాల పేర్ల మార్పు విషయంలో తమ వినతులను.. అభ్యంతరాలను కమిటీకి అందిచాలని సూచించారు. వినతులను పరిశీలించిన అనంతరం వాటి ఆధారంగా జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పులకు జీవోఎం కమిటీ చర్యలు తీసుకుంటుందని మంత్రి అనగాని స్పష్టం చేశారు.




అమరావతి: టాలీవుడ్‌లో నెలకొన్న సమస్యలపై పలువురు అగ్ర నిర్మాతలు.. ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్‌తో భేటీ అయిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అపాయింట్‌మెంట్ కావాలని మంత్రిని కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందించారు. నిర్మాతలతో సమావేశం అనంతరం మంత్రి మాట్లాడారు. "ప్రస్తుతం టాలీవుడ్‌లో నెలకొన్న పరిణామాల గురించి తెలియజేయడానికి నిర్మాతలు వస్తామన్నారు. ఆ మేరకు కలిశారు. ప్రత్యేక ఎజెండా ఏమీ లేదు. ఆందోళన నేపథ్యంలో సినీ కార్మికులు, నిర్మాతలు ఇరువురూ చెప్పే విషయాలు వింటాం. ఈ అంశంపై ఫెడరేషన్, ఫిల్మ్ ఛాంబర్ సామరస్యంగా మాట్లాడుకోవాలి. అవసరమైతే సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి సంబంధిత అంశాన్ని తీసుకెళ్లి చర్చిస్తాం. ప్రభుత్వ జోక్యం అవసరమైతే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయం తీసుకుంటారు. ఏపీలో చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు కృషి చేస్తాం. ఏపీలో ఎవరైనా స్టూడియోలు, రీ రికార్డింగ్ థియేటర్లు, డబ్బింగ్ థియేటర్లు నిర్మించాలని ముందుకు వస్తే ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తాం" అని పేర్కొన్నారు.

**నిర్మాతల విజ్ఞప్తి..** మంత్రి దుర్గేశ్‌తో సమావేశం అనంతరం నిర్మాతలు మీడియాతో మాట్లాడారు. "ఏపీలో సినీ పరిశ్రమ అభివృద్ధికి సూచనలు ఇచ్చాం. సినీ రంగానికి సంబంధించి ఏపీలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరాం. డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లను ఆదుకునేలా ప్రోత్సాహకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశాం. సినీ రంగాన్ని ప్రత్యేక పరిశ్రమగా గుర్తించాలని కోరాం. థియేటర్ల యజమానులు నష్టపోతున్న దృష్ట్యా ఆదుకోవాలని విన్నవించాం. సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక పాలసీ రూపొందించాలని కోరాం. సమస్యల పరిష్కారానికి ఏపీ సీఎం అపాయింట్‌మెంట్ కోరాం. ఇప్పిస్తామని మంత్రి దుర్గేశ్ హామీ ఇచ్చారు. త్వరలోనే ఏపీ సీఎం, డిప్యూటీ సీఎంను కలుస్తాం" అని పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో బీవీఎస్ఎన్ ప్రసాద్, రవిశంకర్ యలమంచిలి, టీజీ విశ్వప్రసాద్, నాగవంశీ, డీవీవీ దానయ్య, బన్నీ వాసు తదితరులున్నారు.




అమరావతి: వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో హోం మంత్రి అనిత జిల్లాల కలెక్టర్లు, విపత్తు నిర్వహణశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కువగా నష్టం జరగనున్న ప్రాంతాలను ముందే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రమాద హాట్‌స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. తాజా పరిస్థితులపై తనకు ఎప్పటికప్పుడు నివేదించాలని అధికారులను మంత్రి కోరారు.




## మునీర్ 'అణు బెదిరింపుల'పై భారత్ మండిపాటు

దిల్లీ: అమెరికా పర్యటనలో ఉన్న పాకిస్థాన్ సైన్యాధిపతి అసీం మునీర్.. అక్కడి నుంచే భారత్‌పై అణు బెదిరింపులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఆయన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. పాకిస్థాన్ అణ్వాయుధాలు కలిగిన ఉన్మాద దేశమని దుయ్యబట్టింది. అమెరికా అండ చూసుకుని ఇప్పుడు దాయాది తన అసలు రంగు చూపిస్తోందని మండిపడింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ శాఖ దీనిపై ప్రకటన విడుదల చేసింది. "అణ్వాయుధాల వినియోగంపై బెదిరింపులు పాక్‌కు అలవాటే. ఇలాంటి వ్యాఖ్యలతో (మునీర్ మాటలను ఉద్దేశిస్తూ) ఆ దేశం ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందో అంతర్జాతీయ సమాజం అర్థం చేసుకోవాలి. పాక్ అణ్వాయుధాలపై ఎవరి నియంత్రణ ఉందో దీన్ని బట్టి స్పష్టమవుతోంది. అక్కడ సైన్యం, ఉగ్ర ముఠాలతో చేతులు కలిపింది. అమెరికా గడ్డపై మునీర్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం విచారకరం. అయితే, ఇలాంటి అణు బెదిరింపులకు భారత్ భయపడదు. దేశ భద్రత కోసం ఎలాంటి చర్యలకైనా వెనుకాడబోం" అని విదేశాంగ శాఖ తమ ప్రకటనలో వెల్లడించింది. అంతకుముందు కేంద్ర ప్రభుత్వంలోని ఉన్నత స్థాయి వర్గాలు కూడా దీనిపై స్పందించాయి. "పాక్ మిలిటరీకి అమెరికా మద్దతిచ్చినప్పుడల్లా.. వారు తమ నిజస్వరూపాన్ని బయటపెడుతూనే ఉంటారు. అక్కడ (దాయాదిని ఉద్దేశిస్తూ) ప్రజాస్వామ్యం లేదని దీన్ని బట్టి చూస్తే తెలుస్తోంది. ఆ దేశాన్ని సైన్యమే నియంత్రిస్తోంది. పాక్ వద్ద ఉన్న అణ్వాయుధాలు ఉగ్రవాదుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది. అదే జరిగితే ఈ ప్రాంతంతో పాటు ప్రపంచం మొత్తానికి ముప్పు ఎదురైనట్లే" అని భారత ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఫ్లోరిడాలో ఓ కార్యక్రమంలో మాట్లాడిన మునీర్.. భారత్‌పై మరోసారి నోరుపారేసుకున్నారు. తమది అణ్వాయుధ సామర్థ్యం కలిగిన దేశమని, ఒకవేళ భవిష్యత్తులో న్యూదిల్లీ నుంచి తమ అస్థిత్వానికి ముప్పు ఎదురైతే.. తమతో పాటు సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామంటూ ప్రేలాపనలు చేశారు. కాగా.. మునీర్ అమెరికా పర్యటనకు వెళ్లడం గత రెండు నెలల్లో ఇది రెండోసారి. భారత్‌పై ట్రంప్ సుంకాల భారం మోపుతున్న వేళ మునీర్ అగ్రరాజ్యంలో పర్యటిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

## మద్యం కేసు.. కెసిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి బెయిల్ పిటిషన్లపై విచారణ



విజయవాడ: ఏపీ మద్యం కేసులో నిందితుడు సజ్జల శ్రీధర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విజయవాడ ఏసీబీ కోర్టులో విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై సిట్ కౌంటర్ దాఖలు చేయగా.. న్యాయస్థానం తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ కేసులో సజ్జల శ్రీధర్ రెడ్డి ఏ6గా ఉన్నారు. మరోవైపు మద్యం కేసులో నిందితుడు రాజ్ కెసిరెడ్డి బెయిల్ పిటిషన్ పైనా విజయవాడ ఏసీబీ కోర్టు విచారణ జరిపింది. కౌంటర్ దాఖలు చేయాలని సిట్‌ను ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈనెల 13కి వాయిదా వేసింది. ఈ కేసులో రాజ్ కెసిరెడ్డి ఏ 1గా ఉన్నారు. నిందితులిద్దరూ విజయవాడ జిల్లా జైల్లో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు.



## లిక్కర్ స్కామ్ కేసులో జగన్‌కు బిగ్ షాక్

అమరావతి: మద్యం కుంభకోణం కేసులో సిట్ దూకుడు ప్రదర్శిస్తుంది. విజయవాడ ఏసీబీ కోర్టులో రెండో ఛార్జ్ షీట్ దాఖలు చేయనొంది సిట్. 200 పేజీలతో రెండో ఛార్జ్ షీట్‌ను రెడీ చేసినట్లు సిట్ అధికారులు తెలుపుతున్నారు. రెండవ ఛార్జ్ షీట్‌లో ముగ్గురి పాత్రపై కీలక ఆధారాలను పొందుపరిచినట్లు అధికారులు పేర్కొన్నారు. ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పల కాల్ డేటా రికార్డు, గూగుల్ టేక్ అవుట్, ఇతర ల్యాప్‌టాప్‌లోని వివరాలను ఛార్జ్ షీట్‌లో జోడించినట్లు అధికారులు వెల్లడించారు. బిగ్‌బాస్ ఆదేశాల మేరకే మద్యం విధానం మార్పు, సిండికేట్ సమావేశాలు, ముడుపుల వ్యవహార విషయంలో కూడా ఈ ముగ్గురి పాత్ర కీలకమని ఉందని సిట్ అధికారులు నిర్ధారించారు. మద్యం ముడుపులను ఎలా సేకరించాలి, ఎక్కడ దాచాలి, బ్లాక్‌ను వైట్‌గా ఎలా మార్చాలి... అనే అంశాలపై బాలాజీ గోవిందప్ప సూచనలు చేసినట్లు సిట్ అధికారులు గుర్తించారు. మద్యం విధానం రూపకల్పనలో ధనుంజయ్ రెడ్డి అడుగడుగునా జోక్యం చేసుకున్నారని పేర్కొన్నారు. మద్యం ముడుపులు ఎవరి వద్ద నుంచి ఎంత తీసుకున్నారు.. ఎవరెవరికి చేరింది అనే అంశంపై కూడా వివరాలను సేకరించినట్లు తెలిపారు. విజయ్ సాయిరెడ్డి, మిథున్ రెడ్డిలతో ఈ ముగ్గురు ఫోన్‌లో మాట్లాడిన వివరాలను కూడా సేకరించినట్లు అధికారులు చెబుతున్నారు. లిక్కర్ సిండికేట్ సమావేశాలకు పలుమార్లు ధనుంజయ్ రెడ్డి హాజరు అయినట్టు గూగుల్ టేక్ అవుట్(%+శీశీస్త్రశ్రీవ ఖఎవశీబ్%) సాక్ష్యాలను సిట్ పొందుపరిచినట్లు సమాచారం. ఈ ముడుపులలో ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిలు కూడా కొంతవరకు సొమ్ములు వెనకేసుకున్నారని సిట్ వివరించింది. ఈ మొత్తాన్ని బినామీల పేర్లతో పెట్టుబడులు పెట్టారని.. దానికి సంబంధించిన సాక్ష్యాలను సేకరించినట్లు సిట్ చెప్పుకొచ్చింది. గత నెల జులై 19వ తేదీన 305 పేజీలతో తొలి ఛార్జ్ షీట్ దాఖలు చేసినట్లు సిట్ గుర్తు చేసింది. మూడు ట్రంక్ పెట్టెల్లో ఛార్జ్ షీట్‌తో పాటు వివిధ డాక్యుమెంట్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, హార్డ్ డిస్కులను కూడా కోర్టుకు సమర్పించిన సిట్. మొదటి ఛార్జ్ షీట్‌లో రాజ్ కేసిరెడ్డి ద్వారా ముడుపులు మిథున్ రెడ్డి, విజయ్ సాయిరెడ్డికి చేరాయని, అక్కడ నుంచి బాలాజీ గోవిందప్ప ద్వారా అప్పటి సీఎం జగన్‌కు చేరాయని సిట్ స్పష్టం చేసింది.




నాగార్జునసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణా పరివాహక ప్రాజెక్టులు కళకళలాడుతున్నాయి. జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు క్రమంగా వరద నీరు పెరుగుతోంది. శ్రీశైలం ఇన్‌ఫ్లో 1,99,714 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో 1,00,800 క్యూసెక్కులుగా ఉంది.

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 35 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,485 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 881.20 అడుగుల నీటిమట్టం ఉంది. పూర్తి నీటినిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలకు గానూ.. ప్రస్తుతం 194.30 టీఎంసీల నీరు ఉంది.

**8 గేట్లు ఎత్తి నీటి విడుదల...** మరోవైపు నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండను తలపిస్తోంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు వరద ప్రభావం పెరిగింది. దీంతో 8 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 64,465 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు 65,800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. 1,10,483 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి, ప్రస్తుత నీటి మట్టాలు 590 అడుగులుగా ఉన్నాయి. సాగర్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం అంతే స్థాయిలో నీరు నిల్వ ఉంది.

## దాచేపల్లి ఘటనపై ప్రభుత్వం సీరియస్.. హాస్టల్ అధికారిపై వేటు

దాచేపల్లి: పల్నాడు జిల్లా దాచేపల్లి ప్రభుత్వ బాలుర కళాశాల హాస్టల్‌లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థిపై సెకెండియర్ విద్యార్థులు దాడి చేసిన ఘటనపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వసతిగృహ సంక్షేమ అధికారిని విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వాచ్‌మన్ సంజేశ్వరరావుపై వేటు వేస్తూ ఉత్తర్వులిచ్చారు. దాడి చేసిన విద్యార్థులను హాస్టల్ నుంచి పంపించి వేయాలని ఆదేశించారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని విచక్షణారహితంగా కొట్టిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన సంగతి తెలిసిందే. తాను ప్రేమించిన యువతిని ప్రేమిస్తున్నాడని ఒకరిని, తమకు నచ్చినట్లు హెయిర్ కటింగ్ చేయించుకోవాలని మరొకరిని (దివ్యాంగుడిని) కళాశాల పూర్వ విద్యార్థి, అతని స్నేహితులు నలుగురు కలిసి విచక్షణారహితంగా చితక బాదారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. దాచేపల్లి మండలం శ్రీనగర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు దాచేపల్లి జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. వీరిలో ఒకరు కళాశాలలో చదివే యువతిని ప్రేమిస్తున్నాడనే విషయం పూర్వ విద్యార్థి నరేంద్రకు తెలిసింది.

తాను కూడా ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నానని వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్న తన స్నేహితులకు చెప్పాడు. ఈనెల 7న రాత్రి ఆ విద్యార్థిని బీసీ వసతిగృహానికి పిలిపించి విచక్షణారహితంగా దాడి చేశారు. నొప్పులు తగ్గడానికి మాత్రలు, శీతల పానీయం ఇచ్చి ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించి పంపించేశారు. అదేరోజు ఉదయం ఓ దివ్యాంగ విద్యార్థిని తనకు నచ్చినట్లు హెయిర్ కటింగ్ చేయించుకోవాలని సహచరులతో కలిసి నరేంద్ర కొట్టాడు. విద్యార్థిని వసతిగృహానికి పిలిచి కొట్టిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో విషయం బాధిత యువకుడి తల్లిదండ్రులకు చేరింది. వారు ఆరా తీసి.. శనివారం దాచేపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.




# పాయల్ కిల్లింగ్ లుక్స్.. పిచ్చెక్కిపోవాలంతే..!

ఆరెక్స్ 100 బ్యూటీ పాయల్ రాజ్ పుత్ ఎందుకో కెరీర్ లో వెనకపడింది. మంగళవారం తర్వాత మళ్లీ తిరిగి ఫాంలోకి వస్తుందని భావించినా ఎందుకో అమ్మడు సరైన ఛాన్స్ లు అందుకోవట్లేదు. లాస్ట్ ఇయర్ రక్షణ అంటూ ఒక అటెంప్ట్ చేసింది కానీ అది కూడా వర్క్ అవుట్ కాలేదు. ఇక ప్రస్తుతం ఆది సాయి కుమార్ హీరోగా చేస్తున్న కిరాతక సినిమాలో నటిస్తుంది పాయల్. ఆ సినిమాతో పాటు తమిళ్ లో గోల్ మాల్, ఎంజల్ అనే రెండు సినిమాలు చేస్తుంది. అంతకుముందు పంజాబి, హిందీ, తెలుగు, ఒక కన్నడ సినిమా మాత్రమే చేసిన పాయల్ రాజ్ పుత్ ఇప్పుడు తమిళ పరిశ్రమకు ఎంట్రీ ఇస్తుంది. ఐతే పాయల్ సినిమాల కన్నా తన ఫోటో షూట్స్ తో ఆడియన్స్ ని ఎట్రాక్ట్ చేస్తుంది. తన ఫ్యాన్స్ అండ్ ఫాలోవర్స్ ని ఎప్పుడు నిరాశ చెంద నివ్వదు పాయల్. ఈ క్రమంలో తన ఫోటో షూట్స్ వారిని ఎంటర్టైన్ చేస్తాయి. లేటెస్ట్ గా పాయల్ గ్లామర్ షో చేస్తూ షేర్ చేసిన ఫోటో షూట్ ఆమె ఫాలోవర్స్



ని పిచ్చెక్కిపోయేలా చేసింది. బ్లాక్ కలర్ స్లీవ్ లెస్ జాకెట్, డెనిమ్ షార్ట్ తో పాయల్ అందాల రచ్చ ఆడియన్స్ కి కనువిందు చేస్తుంది. అంతేకాదు ఆ గ్లామర్ షోకి తోడు అమ్మడి ఓర చూపులు మెంటల్ ఎక్కించేస్తున్నాయంటే నమ్మాల్సిందే. ఒక స్టార్ మెటీరియల్ అయిన పాయల్ రాజ్ పుత్ ఇలా కేవలం ఫోటో షూట్స్ కే అంకితం అవ్వడం ఇబ్బందిగానే అనిపించినా అమ్మడు మాత్రం తన కెరీర్, తన ఫ్యాన్స్ తో సంతృప్తి చెందుతుంది. పాయల్ రాజ్ పుత్ కి సినిమాల ఫలితాలు వాటి వల్ల వచ్చే ఛాన్స్ లు ఎలా ఉన్నా ఇలా ఫోటో షూట్స్ తోనే ఎక్కువ మైలేజ్ వస్తుంది. మరి అమ్మడు తిరిగి ఫాంలోకి రావాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నా అవకాశాలు పెద్దగా రావట్లేదు. ఐతే పాయల్ ఫ్యాన్స్ మాత్రం తమకు ఇలా ఫోటో షూట్స్ చేసినా చాలని అంటున్నారు. పాయల్ లాంటి అందాల భామ ఇలా కెరీర్ లో వెనకపడం ఆమె ఫ్యాన్స్ ని కలవరపరిచేలా చేస్తుంది. ఐతే రానున్న సినిమాలతో అయినా పాయల్ కి సక్సెస్ వచ్చి తద్వారా మరిన్ని అవకాశాలు రావాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. మరి అది జరుగుతుందా లేదా అన్నది ఆ సినిమాలు వచ్చాక తెలుస్తుంది.

# బల్ల గుద్ది మరీ ఎగ్ దోశను ఎత్తేసింది!

కన్నడ బ్యూటీ వర్ష బొలమ్మ కు యూత్ లో మంచి ఫాలోయింగ్ ఉంది. సక్సెస్ లతో పనిలేకుండా అమ్మడికి క్రేజ్ ఉంది. కోలీవుడ్ లో కెరీర్ ప్రారంభించిన అమ్మడిప్పుడు అన్ని భాషల్లోనూ సినిమాలు చేస్తోంది. దక్షిణాదిన అన్ని భాషల్ని టచ్ చేసింది. చూసి చూడంగానే చిత్రంతో లాంచ్ అయిన బ్యూటీ జాను మిడిల్ క్లాస్ మెలోడీస్ లాంటి చిత్రాలతో మరింత దగ్గరైంది. మీడియం బడ్జెట్ చిత్రాలతో నిర్మాతలకు అందుబాటులో ఉన్న నాయిక. తాజాగా రిలీజ్ అయిన తమ్ముడు లో కూడా నటించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాపై చాలా ఆశలు పెట్టుకుంది. కానీ వాటిని అందుకోవడంలో తమ్ముడు వేగం చూపించలే కపో తున్నాడు. ఆ సంగతి పక్కన బెడితే వర్ష మంచి ఫుడీ కూడా. రెండేళ్ల వయసులోనే మూడు గుడ్లు లాగిం చేసింది. ఎగ్ ప్యావరెట్. తాజాగా వర్ష ఎగ్ దోశను ఏ రేంజ్ లో ఆస్వాదించిందో తెలిస్తే చెప్ప స్పెషలిస్ట్ కూడా వర్ష రేంజ్ లో ఎలివేషన్ ఇవ్వలేడేమో అనిపిస్తుంది. తమ్ముడు షూటింగ్ లో భాగంగా రంపచోడవరం రోడ్డు పక్కనే ఉన్న చిన్న హెూటల్ లో యగ్ దశోను



మాత్రం ఎప్పటికీ మర్చిపోలేనంటోంది. ఎగ్ దోశెను వేసిన విధానం...కాల్చిన విధానాన్ని వర్ష భలే వివరించింది. ఆ రుచి గురించి చెబుతూ జీవితంలో ఇంతవరకూ అంత టేస్టీ ఎగ్ దోశ తినలేదంది. ఈ విషయాన్ని బల్ల గుద్ది మరీ చెప్పింది. దానికి సంబంధించిన వీడియో ఒకటి వైరల్ అవుతుంది. ఎగ్ దోశె గురించి వర్ష చెబుతున్నప్పుడు ముఖంలో ఆ ఎక్స్ ప్రెషన్ చూస్తే ఆ దోశ టేస్ట్ ను అమ్మడు ఏ రేంజ్ లో ఆస్వాదించిందో అర్దమవుతుంది. ఏది ఏమైనా మరోసారి తాను ఎగ్ ప్రియురాలని నిరూపించింది. ఆ ఎగ్ దోశ చేసింది ఓ కూడా ఓ ఆంటీ అని తెలిపింది. ఆవిడెవరో తెలిస్తే కుమారీ అంటీ వైరల్ అయినట్లు అవ్వడం ఖాయం. ఈ మధ్య కాలంలో ఫుడ్ వీడియోలు ఎక్కువగా వైరల్ అవుతోన్న సంగతి తెలిసిందే.

# సుహాస్ 'ఓ భామ అయ్యో రామ'.. బ్యూటిఫుల్ ట్రైలర్ చూశారా?



విభిన్నమైన, వైవిధ్యమైన కథాంశాలను ఎంచుకోవడంలో పేరుగాంచిన యంగ్ అండ్ ప్రామిసింగ్ హీరో సుహాస్.. ఇప్పుడు కొత్త రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ ఓ భామ అయ్యో రామ మూవీతో ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు రానున్నారు. మాలీవుడ్ మూవీ జో లో తన రోల్ తో క్రేజ్ సంపాదించుకున్న మాళవిక మనోజ్.. సుహాస్ సరసన నటిస్తున్నారు. ఓ భామ అయ్యో రామ మూవీతోనే టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలోకి వస్తున్నారు. రామ్ గోధల దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాను వీ ఆర్ట్స్ బ్యానర్ పై హరీష్ నల్ల నిర్మిస్తున్నారు. ప్రముఖ దర్శకులు మారుతి, హరీష్ శంకర్ అతిథి పాత్రలో కనిపించబోతున్నారు. స్పిరిట్ మీడియా బ్యానర్ పై రానా దగ్గుబాటి.. సినిమాను రిలీజ్ చేస్తున్నారు. ఇప్పటికే అన్ని పనులు పూర్తి చేసిన మేకర్స్.. ప్రస్తుతం ప్రమోషన్స్ చేపడుతున్నారు. వరుసగా అప్డేట్స్ ఇస్తున్నారు. ఆడియన్స్ ను మంచి రెస్పాన్స్ అందుకుంటున్నారు. తాజాగా థియేట్రికల్ ట్రైలర్ ను రిలీజ్ చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ట్రైలర్.. అందరినీ ఆకట్టుకుని సందడి చేస్తోంది. ట్రైలర్ బట్టి.. ఓ భామ అయ్యో రామ క్యూట్ అండ్ ఎంటర్టైనింగ్ లవ్ స్టోరీలా సినిమా ఉండనున్నట్లు అర్థమవుతుంది. ఎంటర్టైన్మెంట్ తోపాటు ఎమోషన్, హీరో, హీరోయిన్స్ ఎనర్జీ.. అలా ప్రజెంట్ జెనరేషన్ ఆడియన్స్ తోపాటు అన్ని వర్గాల సినిమాను అలరించనున్నట్లు ఓ భామ అయ్యో రామ రూపొందిస్తున్నారని తెలుస్తుంది. ముఖ్యంగా ట్రైలర్ లో ప్రతి ఫ్రేమ్ కలర్ ఫుల్ గా ఉందని చెప్పాలి. హీరోహీరోయిన్ల మధ్య సీన్స్ బాగున్నాయి. సుహాస్ ఎనర్జిటిక్ గా కనిపిస్తున్నారు. రామ్ గోధల సినిమా కోసం బాగా కష్ట పడినట్లు తెలుస్తోంది. ప్రొడక్షన్ వాల్యూస్ రిచ్ గా ఉన్నాయి. ఓవరాల్ గా ట్రైలర్.. మూవీపై అంచనాలు పెంచుతోంది. అయితే ట్రైలర్ రిలీజ్ తర్వాత నిర్మాత హరీష్ మాట్లాడారు. ట్రైలర్ విడుదలైన కొన్ని గంటలకే మంచి స్పందన వచ్చిందని, చాలామంది సినిమా విజయం సాధిస్తారని అంచనా వేస్తున్నారని తెలిపారు. రొమాంటిక్ ఎంటర్టైనర్ లోని ప్రతి సన్నివేశం ప్రేక్షకులను నిమగ్నం చేసేలా రూపొందించామని చెప్పారు. ఇప్పటి వరకు విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ కు అద్భుతమైన సానుకూల స్పందన వచ్చిందని దర్శకుడు రామ్ పేర్కొన్నారు. నిర్మాణంలో ఏ దశలోనూ నాణ్యత విషయంలో రాజీ పడలేదని నిర్మాతను ప్రశంసించారు. హరీష్ మద్దతు వల్లే తాము ఇంత నాణ్యమైన ఉత్పత్తిని నిర్మించగలిగామని తెలిపారు. మరి ఎలాంటి హిట్ సాధిస్తారో వేచి చూడాలి.

# 'కూలీ' పోస్టర్.. అలా అంటున్నారేంటి?




కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్, ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్ లో రూపొందుతున్న కూలీ మూవీ రిలీజ్ కు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. యాక్షన్ థ్రిల్లర్ గా రెడీ అవుతున్న ఆ సినిమా.. ఆగస్టు 14వ తేదీన వరల్డ్ వైడ్ గా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. పాన్ ఇండియా రేంజ్ లో సందడి చేయనుంది. అయితే కూలీ మూవీని సన్ పిక్చర్స్ బ్యానర్ పై కళానిధి మారన్ నిర్మిస్తుండగా.. పొడుగు కాళ్ల సుందరి పూజా హెగ్డే స్పెషల్ సాంగ్ లో సందడి చేయనున్నారు. టాలీవుడ్ కింగ్ నాగార్జున కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయనతోపాటు ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, శ్రుతిహాసన్ యాక్ట్ చేస్తున్నారు. బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ కూడా నటిస్తున్నారు. అమీర్ నటిస్తున్న విషయాన్ని అనౌన్స్ చేస్తూ.. మేకర్స్ రీసెంట్ గా పోస్టర్ రిలీజ్ చేశారు. ఆ సమయంలో ఐమ్యాక్స్ లోనూ రిలీజ్ చేస్తామని పోస్టర్ లో మెన్షన్ చేశారు. ఇప్పుడు ఆ విషయమే చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే.. ఐమ్యాక్స్ ఫార్మాట్ లో కూలీ మూవీ విడుదల అవ్వడానికి ఇంకా డీల్ ఫిక్స్ అవ్వలేదట. ఎందుకంటే ఇప్పటికే బాలీవుడ్ మూవీ వార్-2 మేకర్స్ తోపాటు ఐమ్యాక్స్ ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సినిమా కూడా ఆగస్టు 14వ తేదీన రిలీజ్ కానుంది. దీంతో వేరే సినిమా ఆ రోజు ఐమ్యాక్స్ ఫార్మాట్ లో విడుదల అయ్యే అవకాశం లేదు. అయినప్పటికీ.. పోస్టర్ లో కూలీ మేకర్స్ ఐమ్యాక్స్ లోగోను వేశారు. ఇప్పుడు ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఐమ్యాక్స్ బ్రాండింగ్ నియమాలకు కూలీ మూవీ పోస్టర్ విరుద్ధంగా ఉందని కామెంట్లు పెడుతున్నారు. ఇటువంటి చర్యలు.. పరిశ్రమ పద్ధతుల పట్ల గౌరవం గురించి ప్రశ్నలను లేవనెత్తుతాయని అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ ఐమ్యాక్స్ తో చర్చలు జరుపుతున్నా.. లోగో ఉపయోగించకూడదని అంటున్నారు. ఒప్పందం కుదరకుండా లోగో వేస్తే ప్రేక్షకులను తప్పుదారి పట్టించినట్లు అవుతుందని చెబుతున్నారు. ఏదేమైనా మార్గదర్శకాలకు కట్టుబడి ఉండటం ప్రాధాన్యమని అంటున్నారు. ముఖ్యంగా ఐమ్యాక్స్ వంటి విషయాల్లో కరెక్ట్ గా ఉండాలని సూచిస్తున్నారు. ఏదేమైనా ఐమ్యాక్స్ ఇష్యూ విషయంలో కూలీ మేకర్స్ కే అసలు విషయం తెలియాలి.

# వెంకీ సినిమాలో ఛాన్స్ కొట్టేసిన ఇస్మార్ట్ బ్యూటీ?

ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం మూవీతో బ్లాక్ బస్టర్ ను అందుకున్న వెంకటేష్ తన తర్వాతి సినిమాల విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సంక్రాంతి వస్తున్నాం సినిమాతో వచ్చిన సక్సెస్ ను కాపాడుకోవాలని ఏ కథ పడితే అది కాకుండా మంచి స్క్రిప్ట్ తో సినిమా చేయాలని చూస్తున్నారు విక్టరీ వెంకటేష్. వెంకీ తన తర్వాతి సినిమాను ఎవరితో చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకీ ఓ సినిమాను చేయబోతున్నట్టు ఇప్పటికే వార్తలొస్తున్న సంగతి తెలిసిందే. వీరి కాంబినేషన్ లో రానున్న సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటనైతే రాలేదు కానీ ఆల్రెడీ ఈ సినిమాకు సంబంధించిన



వర్క్ వేగంగా జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే త్రివిక్రమ్ సినిమాకు కథను లాక్ చేసి ప్రీ ప్రొడక్షన్ వర్క్ కూడా పూర్తి చేశారని అంటున్నారు. ఈ సినిమాకు వెంకట రమణ కేరాఫ్ ఆనంద నిలయం అనే టైటిల్ ను అనుకుంటున్నారని కూడా వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో వెంకీ నటించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి సినిమాలకు త్రివిక్రమ్ రైటర్ గా పని చేయగా ఆ రెండు సినిమాలూ మంచి హిట్లుగా నిలిచాయి. కానీ త్రివిక్రమ్ డైరెక్టర్ గా మారాక మాత్రం వీరిద్దరూ కలిసి పని చేసింది లేదు. ఇన్నేళ్లకు వీరిద్దరి కాంబోలో సినిమా రానుండటంతో ఈ కాంబినేషన్ పై అందరికీ భారీ అంచనాలున్నాయి. అయితే ఈ సినిమాకు సంబంధించి ఓ క్రేజీ న్యూస్ ఫిల్మ్ న్యూస్ సర్కిల్స్ లో వినిపిస్తోంది. వెంకీ- త్రివిక్రమ్ కాంబినేషన్ లో రానున్న సినిమాలో ఇద్దరు హీరోయిన్లు నటించనుండగా, అందులో ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్ ఒక హీరోయిన్ గా ఫిక్స్ అయినట్టు సమాచారం. త్వరలో సినిమాను మొదలుపెట్టి 2026 సమ్మర్ కు రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. వెంకీ కెరీర్లో 77వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఎప్పుడొచ్చినా ఆడియన్స్ అంచనాలకు తగ్గట్టే ఉంటుందని భావిస్తున్నారు. కాగా నిధి అగర్వాల్ ప్రస్తుతం హరి హర వీరమల్లు, ది రాజా సాబ్ సినిమాల్లో నటిస్తున్న సంగతి తెలిసిందే.

# ఉర్ఫీ జావెద్‌ని టాలీవుడ్ కి తెస్తున్నారా?

ఉర్ఫీ జావెద్ పరిచయం అవసరంలేని పేరు. బాలీవుడ్ లో సినిమాలు చేయలేదు. కానీ సోషల్ మీడియాలో ఎంతో ఫేమస్ . బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ని మించిన ఫాలోయింగ్ ఉర్ఫీ సొంతం అనడంలో ఎలాంటి సందేహం లేదు. వింతైన డిజైనర్ దుస్తుల్లో అందాల ప్రదర్శనలో తానో సంచలనం. డిజైనర్ దుస్తుల్లో రొడ్డెక్కిందంటే? అక్కడ ట్రాఫిక్ జామ్ అవ్వాల్సిందే. ఇన్ స్టా హీటెక్కాల్సిందే. డ్యాష్ అండ్ డేరింగ్ గాళ్. తనదారికి అడ్డొస్తే సెలబ్రిటీలనే ఎదురిస్తుంది. నువ్వెంత అంటే నువ్వెంత అంటుంది. ఇలాంటి వివాదాలు అమ్మడి పేరిట చాలానే ఉన్నాయి. శిల్పా శెట్టి భర్త రాజ్ కుంద్రా తో కూడా తగాదాకి దిగిన సంగతి తెలిసిందే. ఇలా ఇంత ఫేమస్ అయినా అమ్మడికి బాలీవుడ్ లో మాత్రం ఇప్పటికీ అవకాశాలు రాలేదు. కొన్ని టీవీ షోలు..వెబ్ సిరీస్ లు చేసింది. సినిమా ఛాన్సలు మాత్రం రాలేదు. ఈ నేపథ్యంలో ఉర్ఫీ ని టాలీవుడ్ కి తీసుకొచ్చే బాధ్యతను ఓ దర్శక,



నిర్మాత తీసుకున్నాడుట. ఉర్ఫీని హీరోయిన్ గా పెట్టి సినిమా తీస్తే ఎలా ఉంటుంది? అన్న ఆలోచనతో ముంబై వైపు మళ్లినట్లు సమాచారం. ఆ దర్శక, నిర్మాత వెనుక మరో దర్శకుడి హస్తం కూడా ఉందిట. సోషల్ మీడియాలో ఉర్ఫీ ఫాలోయింగ్ చూసే ఈ ఛాన్స్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. మరి ఉర్ఫీని ఎలాంటి పాత్రలో చూపిస్తారో చూడాలి. ఉర్ఫీ కూడా అందాల ప్రదర్శనకు ఏమాత్రం వెనకడుగు వేయదు. ఆఫ్ ది స్క్రీన్ లో నే చిచ్చర పిడుగులా చెలరేగిన బ్యూటీ ఆన్ ది స్క్రీన్ పై ఆగుతుందా? ఆ దర్శక , నిర్మాతలిద్దరు కూడా హీరోయి న్లను అందంగా చూపించడంలో ఎక్స్ పర్ట్ లే. గతంలో కొన్ని బోల్డ్ అటెంప్ట్ లు చేసిన అనుభవం కూడా ఉంది. ఉర్ఫీ ఇమేజ్ కూడా ఈ నయా డైరెక్టర్లకు బాగానే వర్కౌట్ అవుతుంది. మరి ఈ ప్రచారంలో నిజమెంతో? తేలాలి. అలాగే ఈ అవకాశం నిజమే అయితే? ఉర్ఫీ జావెద్ రియాక్షన్ ఎలా ఉంటుంది? అన్నది అంతే ఆసక్తికరం.





# సీఎం రేవంత్‌రెడ్డితో మహేశ్‌కుమార్ గౌడ్ భేటీ.. కీలక అంశాలపై చర్చ

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ భేటీ ముగిసింది.

గంటన్నరకుపైగా సాగిన సమావేశంలో పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంపై నేతలిద్దరూ మాట్లాడుకున్నారు. ఈ నెల 16 లేదా 17 తేదీల్లో పీసీసీ, పీఏసీ భేటీ ఉండే అవకాశం ఉంది. ఈ సమావేశంలో మెజారిటీ నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని నేతలు నిర్ణయించారు. ముఖ్యంగా 42శాతం బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై ఆ సమావేశంలోనే నిర్ణయం తీసుకోనున్నారు. బోర్డు, కార్పొరేషన్ డైరెక్టర్ల పోస్టుల నియామకాలు త్వరగా చేపట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. జనహిత పాదయాత్రలో ప్రజా విజ్ఞప్తుల పరిష్కారాలపై నేతలు చర్చించినట్లు సమాచారం.




# మరోసారి సీఎం రేవంత్‌ను టార్గెట్ చేసిన.. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

హైదరాబాద్: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ.. సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా.. రేవంత్ రెడ్డిపై విరుచకపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనకు మంత్రి పదవి ఇస్తామన్న హామీని అమలు చేయకుండా రాష్ట్ర ముఖ్య నేతలు అడ్డుకున్నారని మండిపడ్డారు. తనకు మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయాన్ని మీడియా ద్వారా ప్రజలకు వివరించినందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు రాజగోపాల్ రెడ్డి 'ఎక్స్' వేదికగా ధన్యవాదాలు తెలిపారు. తనకు మంత్రి పదవిపై హైకమాండ్ మాట ఇచ్చిన విషయం సహా.. కొందరు అడ్డుకుంటున్నారనే వాస్తవాలను భట్టి బయటపెట్టారని చెప్పారు. తనకు మంత్రి పదవి ముఖ్యం కాదన్నారు. ప్రజలుకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కారు అమలు చేయాలని, అవినీతి రహిత పాలన అందించాలని కోరుతున్నానని పేర్కొన్నారు. తెలంగాణ సమాజ ఆకాంక్షలను నెరవేర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఉండాలని ఆశిస్తున్నానట్లు స్పష్టం చేశారు.

**రాష్ట్ర ముఖ్య నేతలు అవమానిస్తున్నారు:** తనకు మంత్రి పదవి ఇస్తామని గతంలో భట్టి విక్రమార్క హామీ ఇచ్చారని, ఇది వాస్తవమని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. అయితే ఆ హామీని అధిష్ఠానం అమలుచేయలేదని వాపోయారు. ఈ విషయంలో తనను రాష్ట్రంలోని ముఖ్య నేతలే అడ్డుకుంటూ అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇందులో వాస్తవాన్ని ప్రజలకు వివరించిన భట్టి విక్రమార్కకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తనకు మంత్రి పదవి ముఖ్యం కాదని, ప్రభుత్వం అవినీతిరహిత పాలనను అందించాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతున్నానన్నారు.

తెలంగాణ సమాజం ఆకాంక్షలు నెరవేర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఉండాలని ఆకాంక్షించారు.

# పార్టీ విలీనంపై కేసీఆర్ అత్యవసర సమావేశం..!




సంగారెడ్డి, ఆగస్ట్ 11: ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తన ముఖ్య అనుచరులతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం పార్టీ ముఖ్య నేతలు కేటీఆర్, హరీష్ రావు, మాజీ ఎంపీ వినోద్ కుమార్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కాళేశ్వరం కమిషన్ రిపోర్టుకు సంబంధించి సుప్రీంకోర్టుకు వెళ్లే విషయంపై వారు కూలంకుషంగా చర్చించారు. అలాగే ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారంపై సైతం సుప్రీంకోర్టుకు వెళ్లాలని వారంతా నిర్ణయించారు. దీంతో పామ్‌హౌస్ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పామ్‌హౌస్ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. అదే విధంగా బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం అంటూ జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఈ సందర్భంగా పార్టీ కీలక నేతలకు అధినేత కేసీఆర్ స్పష్టమైన సూచన ఇచ్చినట్లు సమాచారం. రూ. లక్షల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. దాదాపు 15 నెలల పాటు విచారించిన ఈ కమిషన్.. ఇటీవల ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈ నివేదికలో ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో అంతా బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ కీలకమని స్పష్టం చేసినట్లు కథనాలు వెల్లువెత్తాయి. దీనిపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సిట్ నివేదిక ఆధారంగా దోషులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. దీంతో ఈ అంశంపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని భావిస్తున్నారు. ఇక రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువు తీరిన అనంతరం.. ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టింది. దీంతో బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ అంశంపై బీఆర్ఎస్ పార్టీకి చెందిన కేటీఆర్‌తోపాటు పలువురు నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కోర్టు తీర్పుపై సంతృప్తి చెందని ఆ పార్టీ నేతలు.. సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించారని సమాచారం. మరోవైపు బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేస్తున్నట్లు ఒక ప్రచారం అయితే ఉధృతంగా సాగుతోంది. ఈ ప్రచారాన్ని బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే ఖండించింది.

# సివిల్స్ అభ్యర్థులకు అన్నిరకాలుగా సాయం చేస్తాం: భట్టి విక్రమార్క



హైదరాబాద్: సివిల్స్‌కు సన్నద్ధమయ్యే వారికి ఎంతో కొంత సాయం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం కింద సివిల్స్-2025లో మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు రూ.లక్ష చెక్కులను మంత్రి కోమటిరెడ్డితో కలిసి ఆయన పంపిణీ చేశారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్-2024 విజేతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం ద్వారా అభ్యర్థులకు సాయం అందిస్తామన్నారు. ఈ పథకాన్ని విజయవంతంగా రెండో సంవత్సరం అమలుచేస్తున్నామన్నారు. సివిల్స్ అభ్యర్థులు పరీక్షలకు సిద్ధమయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా సాయం అందించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు.




దిల్లీ, ఎన్సీఆర్‌లలోని అన్ని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని సుప్రీం కోర్టు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. వీధుల్లో కుక్కల బెడద, కుక్కకాటు, రేబిస్ వంటి కారణాల వల్ల మరణాలు పెరుగుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఈ ఆదేశాలు జారీ చేసింది. 8 వారాల్లోపు అన్ని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని చెప్పింది. ఈ చర్యలను అడ్డుకోవడానికి ఏవైనా సంస్థలు ప్రయత్నిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. వీధి కుక్కల దాడుల వల్ల దిల్లీ, ఎన్సీఆర్‌ల పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరుగుతోందని వస్తున్న వార్తలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ పార్దివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ విషయంపై విచారణ కొనసాగిస్తోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వ వాదనలు మాత్రమే వింటామని.. తమ ఆదేశాలకు వ్యతిరేకంగా జంతు ప్రేమికులు, ఇతర పార్టీలు, సంస్థలు వేసిన పిటిషన్లను విచారించబోమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఆదేశాలు జారీ చేశామని ధర్మాసనం పేర్కొంది. వీలైనంత త్వరగా దిల్లీలోని అన్ని ప్రాంతాల నుంచి కుక్కలను దూర ప్రాంతాలకు తరలించాలని అధికారులను అదేశించింది. వీధికుక్కల తరలింపు ప్రదేశాలపై జస్టిస్ పార్దివాలా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభిప్రాయాన్ని కోరగా.. ఇందుకోసం ఇప్పటికే ఓ ప్రదేశాన్ని గుర్తించారని తెలిపారు. జంతు హక్కుల కార్యకర్తలు స్టే ఆర్డర్ పొందడంతో ఆ పనులు నిలిచిపోయాయని న్యాయస్థానానికి వివరించారు. దీంతో ఆగ్రహించిన జస్టిస్ పార్దివాలా 'ఆ జంతు ప్రేమికులందరూ కలిసి రేబిస్‌తో ప్రాణాలు కోల్పోయిన వారిని తిరిగి తీసుకురాగలుతారా?' అని ప్రశ్నించారు. వీధి కుక్కలను దత్తత తీసుకోవడానికి కూడా ఎవరికీ అనుమతి ఇవ్వొద్దని అన్నారు. కుక్కల కోసం వెంటనే షెల్టర్లను నిర్మించాలని అధికారులను ఆదేశించారు.

# హైడ్రాకు మార్షల్స్ షాక్.. స్పందించిన రంగనాథ్




హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం జీతాలు తగ్గించడంపై హైడ్రా మార్షల్స్ ఆందోళన చేపట్టారు. విధులను బహిష్కరించి తమకు న్యాయం చేయాలని నిరసన వ్యక్తం చేశారు. దీంతో హైడ్రా కంట్రోల్ రూమ్ సేవలతోపాటు ట్రైనింగ్, ప్రజావాణి సేవలు నిలిచిపోయాయి. ఈ విషయంపై తాజాగా.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. హైడ్రా మార్షల్స్ ఆందోళనపై ఆయన ఇవాళ(సోమవారం) మీడియాతో మాట్లాడారు. హైడ్రా మార్షల్స్ ఆందోళన టీ కప్పులో తుఫాను లాంటిదని కమిషనర్ రంగనాథ్ చెప్పుకొచ్చారు. జీవో ప్రకారం ఒక స్కేల్ జీతం విడుదల చేశారని తెలిపారు. హైడ్రాలో పనిచేస్తున్న వారి జీతాలు తగ్గే అవకాశం లేదని స్పష్టం చేశారు. చిన్న కన్ఫ్యూజన్‌తో మార్షల్స్ ఆందోళన చెందారని వివరించారు. అందరికి అర్థం అయ్యేలా వివరించామని పేర్కొన్నారు. వాళ్ళు కూడా సంతోష పడ్డారని చెప్పారు. హైడ్రాలో పని చేస్తున్న మార్షల్స్‌కి ఇంకా జీతం పెరుగుతుందని రంగనాథ్ వెల్లడించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ కూడా.. జీతాలు పెంచే అంశంపై పరిశీలన చేస్తుందని తెలిపారు. హైడ్రా మార్షల్స్ పట్ల ఏ అధికారి అమర్యాదగా ప్రవర్తించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలా ఎవరైనా చేస్తే.. నేరుగా తన దృష్టికి తీసుకురావాలని భరోసా ఇచ్చారు. ఇతర రాష్ట్రాల్లో కూడా సమీక్షించి అక్కడ పరిస్థితిని చూసి జీతాలు పెంచే ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. ఎక్కువ గంటలు పనిచేస్తే.. ఓవర్ టైమ్ ఇవ్వాలనే అంశాన్ని కూడా పరిశీలిస్తామని రంగనాథ్ వెల్లడించారు.




హైదరాబాద్: కాగ్ త్రైమాసిక నివేదిక ప్రకారం రాష్ట్ర ఆదాయం బాగా తగ్గిందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.

ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. రాష్ట్ర ఆదాయం తగ్గడం.. ప్రమాద ఘంటికలను మోగిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో ఆర్థిక రంగం దెబ్బతింటోందని విమర్శించారు. ఆరు గ్యారంటీల కాంగ్రెస్ హామీ.. ఆర్థిక రంగానికి నష్టం చేసిందని ఎద్దేవా చేశారు. "రాష్ట్ర ఆదాయం తగ్గుతుంటే.. అప్పులు మాత్రం పెరుగుతున్నాయి. రూ.2,738 కోట్ల మిగులు ఉంటుందని బడ్జెట్లో చూపారు. మొదటి త్రైమాసికానికే రూ.10,583 కోట్ల రెవెన్యూ లోటు వచ్చింది. మూడు నెలల్లోనే రూ.20,266 కోట్లు అప్పుగా తీసుకున్నారు. ఒక్క రోడ్డు వేయలేదు.. ఒక్క కొత్త ప్రాజెక్టు కట్టలేదు.

ఆర్థిక రంగాన్ని ఎలా గాడిన పెడతారో కాంగ్రెస్ ఆర్థిక నిపుణులు చెప్పగలరా?" అని కేటీఆర్ ప్రశ్నించారు.




హనుమకొండ: హనుమకొండలోని రామ్‌నగర్‌లో మంత్రి కొండా సురేఖ ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వొద్దని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు మంత్రి ఇంటిని ముట్టడించారు. వెంటనే 8 నెలల పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు.

మంత్రి ఇంట్లోకి చొరబడే ప్రయత్నం చేయగా సుబేదారి పోలీసులు వారిని అడ్డుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.




దిల్లీ: ఒంగోలులో తెదేపా నేత వీరయ్య చౌదరి హత్య కేసు నిందితుడికి ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. ప్రధాన నిందితుడు సురేష్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ మన్మోహన్ ధర్మానం ఈ మేరకు స్పష్టం చేసింది. ఈ కేసులో ఇప్పటికే 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. సురేశ్‌బాబు పరారీలో ఉన్నట్లు గతంలో పోలీసులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్‌కు అతడికి అర్హత లేదని సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది. కేసులో డబ్బులు చేతులు మారడం, ఫోన్ కాల్స్ సహా తగినన్ని ఆధారాలు ఉన్నాయని ధర్మాసనం స్పష్టం చేసింది. మిగిలిన నిందితులకు రెగ్యులర్ బెయిల్ వచ్చిందని పిటిషనర్ తరఫు న్యాయవాది చెప్పగా.. కింది కోర్టులో తెచ్చుకోవాలని ధర్మాసనం సూచించింది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com